



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 174 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ మంగళవారం 17 మార్చి 2026 పేజీలు : 12 వెల : 2/-




### అమరావతిలో

# హజ్‌హౌస్ నిర్మిస్తాం

**వక్ఫ్ ఆస్తులను కూటమి ప్రభుత్వం కాపాడుతోంది**
**ఇమామ్, మౌజన్‌ల గౌరవవేతన బకాయిలు రూ.45 కోట్లు వెంటనే విడుదల చేస్తాం**
**21 నెలల్లో ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలు**
**విజయవాడ ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇమామ్, మౌజన్‌లకు ఇచ్చే గౌరవ వేతన బకాయిలు రూ.45 కోట్లు వెంటనే విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతిలో నూతనంగా హజ్ హౌస్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లింలకు 21 నెలల్లో అనేక సంక్షేమ పథకాలు అందించిందని వివరించారు. విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్‌లో ప్రభుత్వం తరపున ఇచ్చిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కడపలో అసంపూర్తిగా ఉన్న హజ్ హౌస్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం. పవిత్ర రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్ష చేసిన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇస్తున్నాం. అన్ని జిల్లాల్లోనూ, నియోజకవర్గాల్లోనూ ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశాం. రంజాన్ పండుగను పురస్కరించుకుని పేదలకు దానం చేస్తే సంతోషంగా ఉంటారని మహ్మద్ ప్రవక్త బోధించారు. పేదలకు సాయం చేయడమే ఖురాన్ ప్రవచించిన సూక్తి. ముస్లింలను ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధిలోకి తేవటమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ముస్లింలలో 4.38 లక్షల మందికి ఇస్తూ ఏడాదికి రూ.3,511 కోట్లు ఖర్చు చేస్తున్నాం. 4.5 లక్షల మంది ముస్లిం విద్యార్థులకు తల్లికి వందనం ఇస్తున్నాం. పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్పులు 19,215 మందికి రూ.264 కోట్లు విడుదల చేశాం. దీపం-2.0 పథకం కింద 6.20 లక్షల కుటుంబాలకు రూ.158 కోట్లతో సిలిండర్లకు ఖర్చు చేస్తున్నాం. ఇమామ్‌లకు రూ.5 వేలు, మౌజన్లకు రూ.10 వేల చొప్పున గౌరవ వేతనంగా రూ.180 కోట్లు అందించాం. మరో రూ.45 కోట్ల బకాయిలు కూడా వెంటనే విడుదల చేయాలని అధికారులను ఆదేశించాను."అని ముఖ్యమంత్రి ప్రకటించారు.

**ముస్లింల మనోభావాలను కూటమి ప్రభుత్వం గౌరవిస్తుంది**

"అర్హత కలిగిన ఇమామ్‌లను ప్రభుత్వ ఖాజీలుగా నియమిస్తున్నాం. వివాహ లైసెన్స్ గడువు 3 ఏళ్ల నుంచి 10 ఏళ్లకు పెంచాం. 347 మంది ముస్లింలు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్రకు వెళ్లేలా ఏర్పాటు చేస్తున్నాం. 33,275 మందికి ఆర్థిక చేయూత కింద రూ.193 కోట్లు ఇచ్చాం. యువతకు నైపుణ్యాలు అందించి మెరుగైన ఉపాధి ఉద్యోగాలు దక్కేలా చేస్తున్నాం. గత పాలకులు జీవో 47 ద్వారా వక్ఫ్ బోర్డును వివాదాల్లోకి నెట్టారు. ఆ జీవోను రద్దు చేసి వక్ఫ్ బోర్డును పునర్వ్యవస్థీకరణ చేశాం. 1500 వక్ఫ్ ఆస్తులను సర్వే చేశాం. వక్ఫ్ ఆస్తులను కాపాడుతున్నాం. నూర్ బాషా ఫెడరేషన్ పేరును దూదేకుల ముస్లిం ఫైనాన్స్ కార్పోరేషనుగా మార్పు చేసి రూ.100 కోట్లు కేటాయించాం. గత బడ్జెట్లో మైనారిటీలకు రూ.5,434 కోట్లు కేటాయిస్తే... ఈసారి రూ.6,090 కోట్లు మిగతా .. 2లో..



### అమరజీవి త్యాగమే

# భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకి బీజం

**ఆంధ్ర గడ్డపై నీరు తాగుతున్న ప్రతీ ఒక్కరికీ ఆయన త్యాగం గుర్తుకు రావాలనే... జల్ జవన్ మిషన్ ప్రాజెక్టులన్నింటికీ అమరజీవి పేరు**
**శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి, చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** 'భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆద్యుడు... తెలుగు జాతి ఉనికి కోసం, ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించుకోవడం ప్రతి ఆంధ్రుడి కర్తవ్యం. అలాంటి మహనీయుడి చరిత్రను భవిష్యత్ తరాలు స్మరించుకునే విధంగా మన రాజధాని నడిబొడ్డున ఆయన విగ్రహం ఏర్పాటు చేయడం గర్వంగా ఉంద'ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగీ సీఎం చంద్రబాబు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు 58 రోజుల పాటు కఠోర దీక్ష చేశారని.. ఆత్మార్పణతో రాష్ట్రాన్ని సాధించి పెట్టారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రాజధాని అమరావతి పరిధిలోని శాఖమూరు వద్ద 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "పొట్టి శ్రీరాములు ఎన్నో సామాజిక ఉద్యమాల్లో భాగస్వాములయ్యారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో ఆయన పనిచేశారు. పొట్టి శ్రీరాములు 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల భారీ విగ్రహాన్ని నిర్మించాం. దీని నిర్మాణానికి 26 టన్నుల కాంస్యం, 42 టన్నుల ఐరన్ స్ట్రక్చర్ వినియోగించారు. రాజధానిలో అమరజీవి విగ్రహం నిర్మాణం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. పొట్టి శ్రీరాములు చేసిన మిగతా .. 2లో..

### ఇరాన్‌పై దాడులకు మోదీ పర్యటనకు

# ఏ సంబంధం లేదు

**ఇజ్రాయెల్ రాయబారి**



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌పై దాడులకు ప్రధాని మోదీ పర్యట నకు మధ్య ఎలాంటి సంబంధం లేదని భారత్‌లోని ఇజ్రాయెల్ రాయ బారి రువెన్ అజార్ వెల్లడించారు. ఈ దాడులు, మోదీ పర్యటనకు లింక్ చేస్తూ జరుగుతోన్న చర్చను తోసిపుచ్చారు. ఈ మేరకు సోమవారం జాతీయ వార్తా ఏజెన్సీతో మాట్లాడారు. "ప్రధాని మోదీ పర్యటనకు ముందే మా ప్రాంతంలో పరిస్థితులు అస్థిరంగా ఉన్న సంగతి తెలిసిందే. మోదీ వెళ్లిన 2 రోజుల తర్వాత ఈ ఆపరేషన్ చేపట్టేందుకు మాకు మిగతా .. 2లో..

### రాష్ట్రంలో గృహావసరాలకు

# ఎల్పీజీ గ్యాస్ కొరత లేదు

**బ్లాక్ మార్కెట్‌కు పాల్పడితే కఠిన చర్యలు**
**ప్రజలు పుకార్లను నమ్మి ఆందోళన చెందవద్దు**
**రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో కాల్ సెంటర్‌లు ఏర్పాటు చేశాము**
**ఆన్ లైన్ బుకింగ్‌లో గ్యాస్ బుకింగ్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి**
**పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందాల్సిన పరిస్థితులు లేవని, పుకార్లను నమ్మి గ్యాస్ బుకింగ్‌ల కోసం ఏజెన్సీల వద్ద క్యూలు కట్టవద్దని, రోజు వారి సగటు కంటే ఎక్కువ గ్యాస్ సిలిండర్లను గృహ వినియోగదారులకు అందిస్తున్నామని పౌర సరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమీక్ష సమావేశం వివరాలను మంత్రి నాదెండ్ల మనోహర్ సచివాలయంలోని ప్రచార విభాగంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్ల డించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో వినియోగదారులకు గ్యాస్ డెలివరీ ఇబ్బందిలేకుండా మిగతా .. 2లో..

### రైతన్న వద్దకే ప్రభుత్వం..

# లాభసాటి వ్యవసాయమే లక్ష్యం

**పంటల వైవిధ్యీకరణతో రైతుల ఆదాయం పెంపు - టెక్నాలజీతో వ్యవసాయంలో కొత్త మార్పులకు శ్రీకారం**
**ఖరీఫ్‌ను మే 15 నుంచే ప్రారంభించాలని సీఎం చంద్రబాబు ఆదేశం**
**ఎన్టీఆర్ జిల్లాలో రైతన్న.. మీకోసం కార్యక్రమంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**అమరావతి/ఎన్టీఆర్ జిల్లా, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని ప్రతి రైతు వద్దకే ప్రభుత్వం వెళ్లి లాభసాటి వ్యవసాయం దిశగా మార్గనిర్దేశం చేయడమే లక్ష్యంగా "రైతన్న.. మీకోసం" కార్యక్రమాన్ని చేపట్టామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలోని గొల్లపూడిలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో కలసి రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. స్థానిక రైతులతో కలసి గ్రామంలో తిరుగుతూ మిగతా .. 2లో..

## 18న జూన్ నెల శ్రీవారి ఆర్జిత సేవల టికెట్లు విడుదల



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** భక్తుల సౌకర్యార్థం 2026 జూన్ నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవల (సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ) టికెట్లకు ఎలక్ట్రానిక్ డిప్‌లో పేర్ల నమోదు ఈ నెల 18న ఉదయం 10 గంటలకు తితిదే వెబ్‌సైట్‌లో ప్రారంభం కానుంది. ఈ టికెట్లకు ఈ నెల 20న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం డిప్‌లో ఎంపిక చేస్తారు. డిప్‌లో ఈ-టికెట్లు పొందిన వారు మార్చి 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం మిగతా .. 2లో..


## ఏపీ వ్యాప్తంగా పది పరీక్షలు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. దీంతో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. పరీక్ష కేంద్రాల వద్ద ఆయా పాఠశాలల సిబ్బంది విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించారు.

## ఎలాంటి తప్పు చేయలేదు.. నిర్దోషిగా బయటకు వస్తా

**ఎంపీ పుట్టా మహేష్**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** మొయినాబాద్ ఫామ్‌హౌస్ ఘటనపై ఎంపీ పుట్టా మహేశ్ మరోసారి వివరణ ఇచ్చారు. డ్రగ్స్ కేసులో తనపేరు రావడంపై విచారం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. ఆరోపణలపై జవాబు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. "మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో మిగతా .. 2లో..

### పశ్చిమాసియా ఉద్రిక్తతలు..

# 5,500కు పైగా విమానాలు రద్దు



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్‌ల మధ్య దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అగ్రరాజ్య స్థావరాలపై దాడుల పేరిట ఈ ప్రాంతంలోని దేశాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను ప్రయోగిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత్ నుంచి ఇప్పటివరకు 5,500కుపైగా విమానాలు రద్దయినట్లు పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు రాజ్యసభలో వెల్లడించారు. ఇందులో భారత విమానయాన సంస్థలకు చెందిన 4,335, విదేశీ సంస్థలకు చెందిన 1,187 విమానాలు ఉన్నాయని తెలిపారు. "పశ్చిమాసియాలో గగనతలం మూసివేతల కారణంగా మిగతా .. 2లో..

### గాయపడిన సైనికుడిని

# పరామర్శించిన రాహుల్


**ఐఈడి పేలుడులో కాలును కోల్పోయిన అధికారి**
**ఝార్ఖండ్‌లో నక్సల్ వ్యతిరేక చర్యల్లో గాయాలు**
**సైనికుడి ధైర్యాన్ని కొనియాడిన ప్రతిపక్ష నాయకుడు**



**న్యూఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ న్యూఢిల్లీలో గాయపడిన సైనిక అధికారిని పరామర్శించారు. ఆర్.కే. పురంలో ఉన్న సీఆర్‌పీఎఫ్ మెస్‌లో ఆయన మిగతా .. 2లో..

### 7 వేలకు పైగా లక్ష్యాలపై

# దాడులు చేశాం : ట్రంప్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇప్పటి వరకు ఇరాన్‌లోని 7 వేలకు పైగా లక్ష్యాలపై దాడులు చేశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. తాము లక్ష్యంగా చేసుకున్న వాటిలో అధిక భాగం వాణిజ్య, సైనిక స్థావరాలే ఉన్నాయన్నారు. క్షిపణులు, డ్రోన్లు తయారు చేసే పరిశ్రమలపై దాడులు చేసినట్లు చెప్పారు. ఇవాళ కూడా అలాంటి మూడు కేంద్రాలపై విరుచుకుపడినట్లు తెలిపారు. వారం వ్యవధిలో వందకుపైగా ఇరాన్ నౌకలు ధ్వంసం చేసినట్లు వివరించారు. ఇరాన్ నౌకాదళం, వాయుసేన అంతమయ్యాయన్నారు.

### సినీనటి ప్రత్యూష మృతి కేసు..

# కోర్టులో లొంగిపోయిన సిద్ధార్థరెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన సినీనటి ప్రత్యూష మృతి కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో దోషిగా తేలిన సిద్ధార్థరెడ్డి సుప్రీం కోర్టు తీర్పు మేరకు అమెరికా నుంచి వచ్చి నాంపల్లి కోర్టులో లొంగిపోయాడు. 2002 ఫిబ్రవరి 24న సినీనటి ప్రత్యూష మృతి చెందింది. కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకొని సిద్ధార్థరెడ్డి, ప్రత్యూష తాగారు. ఆస్పత్రిలో చికిత్స మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# అమరావతిలో హజ్ హౌస్ నిర్మిస్తాం

కేటాయించాం. ఉర్దూ అకాడమీకి గత పాలకులు రూ.1 లక్ష మాత్రమే ఇచ్చింది. కూటమి ప్రభుత్వంలో రూ.7 కోట్లు మంజూరు చేశాం. అబ్దుల్ హక్ అవార్డు కింద రూ.1 లక్ష నుంచి రూ.1.25 లక్షలు ప్రోత్సాహకాలు ఇస్తున్నాం. ఉర్దూ ఘర్, షాధీ ఖానాల నిర్మాణానికి రూ.2.85 కోట్లు కేటాయించాం. ముస్లిం జీవన ప్రమాణాలు పెంచేలా చేస్తున్నాం. అన్ని మతాలను గౌరవిస్తా... అందరివాడిలా ఉంటా. పేదలను ఆదుకునేందుకు పీ4 తీసుకొచ్చాం. ఎక్కడ పేదవాడు ఉంటే అక్కడ నేను ఉంటా' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ విందులో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు నజీర్, బోండా ఉమ, గద్దె రామ్మోహన్, పలువురు ప్రజా ప్రతినిధులు, ముస్లిం మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

# అమర జీవి త్యాగమే భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకి బీజం

త్యాగాన్ని తెలుగుజాతి గుర్తుపెట్టుకోవాలి" అని చంద్రబాబు అన్నారు. గత పాలకులు 3 రాజధానుల పేరిట అసలు రాజధానే లేకుండా చేశారని చంద్రబాబు విమర్శించారు. "రాజధాని ప్రాంతాన్ని శ్మశానం, ఎడారి అంటూ ఎన్నో రకాలుగా అసత్యాలు ప్రచారం చేశారు. రాజధాని నిర్మాణంలో రైతులను భాగస్వాములను చేయాలని ఆలోచించా. రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి 33 వేల ఎకరాలు ఇచ్చారు. గత ప్రభుత్వ పాలనలో విధ్వంసం జరిగింది.. బ్రాండ్ నష్టపోయింది. రాష్ట్ర పునర్నిర్మాణం కోసమే కూటమి ఏర్పాటు చేశాం. సమస్యలు వచ్చినప్పుడు బాధపడితే నష్టపోతాం.. సరైన నిర్ణయం తీసుకుని ముందుకెళ్తే అనుకున్నది సాధిస్తాం. కష్టకాలంలో సమష్టిగా పనిచేయగలిగితేనే మెరుగైన ఫలితాలు వస్తాయి. గోదావరి పుష్కరాలకు ముందే పోలవరాన్ని జాతికి అంకితం చేస్తాం "అని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఆయన ఆత్మబలి దానంతో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ గడ్డపై నీరు తాగుతున్న ప్రతి ఒక్కరికీ ఆయన త్యాగం గుర్తుకు రావాలి...ఆ ఉద్దేశంతోనే జల్ జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన తాగునీటి పథకాలకు అమరజీవి జలధార అని నామకరణం చేసినట్టు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం శ్రీ పొట్టి శ్రీరాములు గారి స్ఫూర్తిని ముందుకు తీసుకు వెళ్తుందని చెప్పారు. సోమవారం శ్రీ పొట్టి శ్రీరాములు గారి 125 జయంతి సందర్భంగా అమరావతిలో ఏర్పాటు చేసిన 58 అడుగుల విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు తో కలసి పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు పేరిట ముద్రించిన పోస్టల్ కవర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "తెలుగు జాతి కోసం ఆత్మార్పణ చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా యావత్ ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున ఆ మహనీయునికి మనస్ఫూర్తిగా నివాళులు అర్పిస్తున్నాను. ఎవరి ప్రాణ త్యాగం మీద ఈ రాష్ట్రం ఏర్పడిందో, ఎవరి దేహ త్యాగం మీద ఈ రోజున తెలుగువారంతా స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నారో ఆ మహనీయుని స్మరించుకోవడం మనందరి కర్తవ్యం. మద్రాస్ ప్రెసిడెన్సీలో తెలుగు ప్రజల ప్రయోజనాలు పరిరక్షణ కోసం, ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు సుదీర్ఘ కాలం ఆమరణ దీక్ష చేశారు. ఆయన ఆత్మబలిదానం ఫలితంగానే తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరించింది. మరిన్ని భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకి దారి చూపింది. ఆంధ్ర రాష్ట్రం తర్వాత 1956లో కేరళ, కర్ణాటక, 1960లో మహారాష్ట్ర, గుజరాత్, 1966లో పంజాబ్, హర్యానాలు భాషా ప్రాతిపదికన ఏర్పడ్డాయంటే అది శ్రీ పొట్టి శ్రీరాములు గారి పుణ్యమే.

**ప్రతి ఆంధ్రుడు అమరజీవి త్యాగాన్ని స్మరించుకోవాలి**

ఆ మహనీయుని చరిత్రను భవిష్యత్ తరాలు స్మరించుకునే విధంగా ఆంధ్రుల రాజధాని అమరావతిలో విగ్రహం ఏర్పాటు చేసేందుకు అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ కి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం 6.8 ఎకరాల భూమి కేటాయించింది. ఆయన చేసిన 58 రోజుల ఆమరణ దీక్షకు గుర్తుగా 58 అడుగుల విగ్రహాన్ని ట్రస్ట్ ఇక్కడ ఏర్పాటు చేసింది. అంతకు ముందే శ్రీ పొట్టి శ్రీరాములు గారు చేసిన త్యాగానికి నివాళిగా కూటమి ప్రభుత్వం తరఫున జల్ జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన మల్టివిలేజ్ స్కీమ్ వాటర్ గ్రిడ్ పథకానికి "అమరజీవి జలధార" అని పేరు పెట్టాం. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలందరికీ రోజుకి 55 లీటర్ల చొప్పున స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి స్ఫూర్తితో రాష్ట్రంలో ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. శ్రీ పొట్టి శ్రీరాములు గారి ఆత్మబలిదానంతో ఏర్పడిన ఈ గడ్డపై నీరు తాగిన ప్రతిసారి ఆయన త్యాగాన్ని గుర్తుకు రావాలి. ప్రతి ఆంధ్రుడు ఆయన త్యాగాన్ని స్మరించుకోవాలన్న ఉద్దేశంతో పథకానికి ఆయన పేరు పెట్టాం.

**రాష్ట్రవ్యాప్తంగా అమరజీవి జలధారలు**

జల్ జీవన్ మిషన్ నిధులతో అమరజీవి జలధార పథకం ద్వారా ఇప్పటికే ఐదు జిల్లాల పరిధిలో రూ. 7,910 కోట్లు ఖర్చు చేసి ఐదు మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులను ప్రారంభించాం. తద్వారా వచ్చే 30 ఏళ్లలో ఒక కోటీ 21 లక్షల మంది దాహార్తి తీర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రూ. 9,355 కోట్లతో మరో ఏడు మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుల నిర్మాణానికి త్వరలో శ్రీకారం చుట్టనున్నాం. తీవ్ర నీటి ఎద్దడి ఉన్న 3 వేల ఆవాసాలను గుర్తించి 3 వేల పనులను సింగిల్ విలేజ్ స్కీం కింద చేపట్టనున్నాం. రూ. 1,814 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టుని ముందుకు తీసుకువెళ్లేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అన్ని తాగు నీటి పథకాలను అమరజీవి జలధార పేరిట ముందుకు తీసుకువెళ్తాం.

**పోరాట స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనం**

పొట్టి శ్రీరాములు ఒక గొప్ప సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడు కూడా. ఈ సందర్భంగా క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో పొట్టి శ్రీరాములు ఔన్నత్యాన్ని గురించి మహాత్ముడు మాట్లాడిన మాటలు మనం స్మరించుకోవాలి. శ్రీరాములు లాంటి వారు మరో 11 మంది నాతో ఉంటే ఏడాదిలో స్వాతంత్ర్యం తీసుకువస్తానన్న గాంధీజీ మాటలు అమరజీవి పోరాట స్ఫూర్తికి నిదర్శనం. ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ.. యావత్ ప్రపంచం తెలుగువారి ఔన్నత్యాన్ని, ఔచిత్యాన్ని గుర్తించేలా కృషి చేస్తామని మాటిస్తున్నాం. నేడు ఆయన కుటుంబ సభ్యుల పక్కన కూర్చునే అవకాశం, వారిని చూస్తూ ఆయన త్యాగాన్ని గుర్తు చేసుకునే అవకాశం లభించింది. మనకంటూ ఒక రాజధాని ఏర్పరుచుకుని, ఆ రాజధాని నడిబొడ్డున అమరజీవి విగ్రహం ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ , కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఐటీ, మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్, ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మంత్రులు కందుల దుర్గేష్, సవిత, పలువురు శాసన సభ్యులు, ఆర్య వైశ్య కార్పోరేషన్ ఛైర్మన్ డూండి రాజేష్, పొట్టి శ్రీరాములు కుటుంబ సభ్యులు, ఆర్య వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

# ఎల్పీజీ గ్యాస్ కొరత లేదు

చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, వాస్తవంగా ప్రజలు సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మి ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ల బుకింగ్ కు ఆతృత పడటంతో సర్వర్లు సైతం మొరాయిస్తున్నాయని వివరించారు. కేంద్రం నిబంధల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులు, పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల తర్వాత మరో గ్యాస్ సిలిండర్ బుకింగ్ కు అనుమతి ఉంటుందని ఈ విషయం ప్రతి ఒక్కరూ గమనించాలని మంత్రి మనోహర్ సూచించారు. సాధారణ రోజుల్లో రోజుకు మన రాష్ట్రంలో 2.81 లక్షల గ్యాస్ సిలిండర్ల బుకింగ్ లు జరుగుతాయని, ఈ ఐదు రోజుల్లో గ్యాస్ కంపెనీలు యావరేజ్ గా 2.92 లక్షల గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేస్తున్నామన్నారు. ఒక్కో రోజు మూడు లక్షల సిలిండర్ల డెలివరీ కూడా చేశామని మంత్రి మనోహర్ వివరించారు. కాని ప్రజలు పుకార్లను నమ్మి ఒక్కసారిగా బుకింగ్ లు చేయడంతో సర్వర్లు సైతం జామ్ అయ్యే పరిస్థితి నెలకొంటుందని, కాని ప్రజలు నిబంధనలు తెలుసుకుని ఆ ప్రకారం బుకింగ్ లు చేయాలని సూచించారు. గ్యాస్ దొరకదన్న పుకార్లను నమ్మి ఎక్కువ మంది గ్యాస్ ఎజెన్సీల వద్ద క్యూలు కడుతున్నారని దీంతో సమస్య తీవ్రంగా ఉందన్న అపోహ ప్రజల్లో పెరుగుతుందన్నారు. కాని వాస్తవంగా యాప్, ఫోన్ కాల్, వాట్సప్, మిస్డ్ కాల్ లతో పాటు ఫోన్ ఫే తదితర యాప్ ల ద్వారా కూడా గ్యాస్ బుకింగ్ చేసుకోవచ్చన్నారు. అందుకనే సమాచార లోపం లేకుండా టెంప్లెట్స్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రం నిబంధనల ప్రకారం గ్యాస్ బుకింగ్ చేయగానే ఓటీపీ వస్తుందని, నూటికి నూరు శాతం ఓటీపీ ఉంటేనే గ్యాస్ సిలిండర్ డెలివరీ చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారన్నారు. దీంతో బ్లాక్ మార్కెట్ ను, అధిక ధరలు వసూళ్లు కు పాల్పడకుండ అరికట్టవచ్చన్నారు. అంతేకాకుండ గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను కమర్షియల్ గా ఉపయోగించకుండ సమర్థవంతంగా అడ్డుకోవచ్చన్నారు. రాష్ట్రంలో ఈ కేవైసీని వినియోగదారులు 95శాతం వరకు చేసుకున్నారని, కొంత మంది ఫోన్ నెంబర్లు మారిపోవడం తదితర కారణాలతో చేయలేకపోయారని దీంతో వారికి గ్యాస్ బుకింగ్ లు అవ్వడం లేదని మంత్రి మనోహర్ వివరించారు. యుద్ధం కారణంగా షిఫ్ మెంట్ లు ఆలస్యం అవుతున్న తరుణంలో కేంద్ర నిబంధనలు అందరూ అవగాహన చేసుకుని సంయమనం పాటించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ల సరఫరాపై కమిషనర్, జేసీలతో టెలీకాన్ఫరెన్స్ ఏర్పాటు చేయడం కూడా జరిగిందన్నారు. పాఠశాలలు, హస్పటల్స్, దేవాలయాలు, సంక్షేమ వసతి గృహాలకు ఎక్కడా కూడా గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగిందన్నారు. అలాగే బ్లాక్ మార్కెట్ పై ఉక్కుపాదం మోపాలని, గృహావసరాలకు వినియోగించాల్సిన సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు ఉపయోగిస్తే వారిపై 6ఏ కేసులు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇప్పటి వరకు అనగా ఈ ఐదు రోజుల్లోనే 616 కేసులు నమోదు చేయడంతో పాటు 2500 గ్యాస్ సిలిండర్లు సీజ్ చేయడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ శాకలను అప్రమత్తం చేసి జేసీల ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసి సమాచార లోపం లేకుండా చూస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు గ్యాస్ కంపెనీలు గృహవినియోగ సిలిండర్ల కొరత లేకుండా సరఫరా చేస్తామని భరోసా కూడా ఇచ్చారని, పైప్ న్యాచురల్ గ్యాస్ పై కూడా భరోసా లభించిందన్నారు. ఇక ఫెర్టిలైజర్స్, వ్యవసాయ సెక్టార్ విషయంలో 80 సబ్సిడీ సరఫరా లేకుండా చూస్తామని గ్యాస్ కంపెనీలు హామి ఇచ్చారన్నారు. ఈ రోజు నుండి గ్యాస్ కంపెనీల నుండి ప్రతి గంటకు ఒకసారి డెటా షేరింగ్ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ డేటా ఆధారంగా ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకుంటూ క్షేత్రస్థాయిలో సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ సజావుగా పరిస్థితులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర కార్యాలయంలోని 1967 కు ఫిర్యాదులు గతంలో 300 కాల్స్ వచ్చేవి, కాని గత రెండు రోజుల నుండి వాటి సంఖ్య 180 దాకా తగ్గాయని అంటే పరిస్థితి అదుపులో ఉంది అని అర్థమవుతుందన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎల్పీజీ గ్యాస్ అందుబాటులోనే ఉందని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరవ్ గౌర్, డైరక్టర్ నుపూర్ పాల్గొన్నారు.

# లాభసాటి వ్యవసాయమే లక్ష్యం

కరపత్రాలను రైతులకు అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతన్నా మీకోసం" కార్యక్రమంలో భాగంగా నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు అనే పంచసూత్రాల అమలుతో రాష్ట్ర వ్యవసాయానికి కొత్త ఊపిరి పోస్తున్నామని తెలిపారు. వ్యవసాయం లాభసాటిగా మారితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, 62 శాతం జనాభా వ్యవసాయ,అనుబంధ రంగాలపై ఆధారపడిన రాష్ట్రంలో రైతును "రాజు"గా నిలబెట్టడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీ నుండి 22వ తేదీ వరకు రైతులకు మద్దతుగా రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి రైతు కుటుంబాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా కలుసుకుని క్షేత్రస్థాయిలో లాభసాటి వ్యవసాయం ఎలా చేయాలో అవగాహన కల్పించడంతో పాటు ప్రతి రైతు సేవా కేంద్రాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని అక్కడ సాగులో ఉన్న పంటలు, రైతుల వివరాలను సేకరిస్తామని చెప్పారు. అంతర్జాతీయ, జాతీయ మార్కెట్ ధరలను దృష్టిలో పెట్టుకుని ఏ ప్రాంతంలో ఏ పంటలు సాగు చేయాలో ముందుగానే సూచనలు అందజేస్తామని వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల అభివృద్ధి కోసం ఐదు ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలోని రిజర్వాయర్లలో సుమారు 80 శాతం నీటి నిల్వలు ఉన్నాయని, కాలువల మరమ్మతులు పూర్తి చేసి సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మార్కెట్‌లో అధిక ధరలు లభించే పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రాయలసీమలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటుతో పాటు మండవల్లిలో నిర్వహిస్తున్న కార్యక్రమాల ద్వారా రైతులకు పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ధరలు పడిపోయినప్పుడు పొగాకు, మామిడి, కోకో, టమోటా, ఉల్లి రైతులకు 588 కోట్ల రూపాయలు ఖర్చుచేసి సుమారు లక్ష మంది రైతులను ప్రభుత్వం ఆదుకుందని, రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనం అని తెలిపారు. గల్ఫ్ లో యుద్ధం కారణంగా ఎగుమతి పంటలైన కొబ్బరి, మొక్కజొన్న, అరటి, వంటి పంటల ధరలు తగ్గాయని వాటి విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని ప్రత్యామ్నాయ మార్గాలను, మార్కట్లను అన్వేషించి రైతులను ఆదుకుంటుందని పేర్కొన్నారు. వ్యవసాయానికి అవసరమైన పలు ఇన్ పుట్ పరికరాల దిగుమతిలో కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాటిని కూడా అధిగమించి రైతులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.20,000 ఆర్థిక సహాయాన్ని మూడు విడతల్లో జమ చేసామని, సీఎం చంద్రబాబు బటన్ నొక్కిన గంటలోనే 99.75 శాతం మంది రైతుల ఖాతాల్లో నగదు జమ అయిందని తెలిపారు. మే 15 నుంచే ఖరీఫ్ సీజన్ ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, రిజర్వాయర్లలో నీరు ఉన్న నేపథ్యంలో రెండు నెలల ముందుగానే సాగు మొదలుపెడితే అకాల వర్షాల నుంచి పంటలను కాపాడుకోవచ్చని రైతులకు సూచించారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని రైతులకు సూచించారు. ఈ నెల 25న ముఖ్యమంత్రి ఒక సచివాలయాన్ని సందర్శించి "రైతన్న.. మీకోసం" కార్యక్రమాన్ని ముగిస్తారని మంత్రి తెలిపారు. రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులను ప్రోత్సహిస్తూ నీటి వినియోగాన్ని తగ్గించే చర్యలు చేపడుతున్నామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. పట్టిసీమ ప్రాజెక్ట్‌పై గతంలో విమర్శలు చేసిన వారు ఇప్పుడు దాని గొప్పతనాన్ని గుర్తిస్తున్నారని అన్నారు. మారుతున్న ఆహార అలవాట్లు, మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల వైవిధ్యీకరణ (డైవర్సిఫికేషన్) వైపు వెళ్లాలని సూచించారు. ఏలూరు ప్రాంతంలో పామాయిల్ సాగుతో రైతులు ఎకరాకు మంచి లాభాలు పొందుతున్నారని, కోకో, మిరియాల వంటి పంటల సాగు కూడా విస్తరిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ ధర పామాయిల్‌కు రాష్ట్రంలో లభిస్తోందని చెప్పారు. గత ఐదేళ్లలో వ్యవసాయ శాఖను నిర్లక్ష్యం చేశారని, ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో , ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో వ్యవసాయ రంగాన్ని తిరిగి బలోపేతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. వ్యవసాయంలో సాంకేతికత వినియోగంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నూజివీడు ప్రాంతంలో మామిడి పంటకు కవర్లు సబ్సిడీతో అందిస్తున్నామని చెప్పారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు కూడా మార్పు తీసుకురావాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతలను ఎదుర్కొనే విధంగా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా రైతులు పనిచేస్తే వ్యవసాయం మరింత లాభసాటిగా మారుతుందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. విమర్శలు చేయడం తప్ప వైసీపీకి మరే పని లేదని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మైలవలం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, రైతులు, ఎన్డీయే కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.

# 18న జూన్ నెల శ్రీవారి ఆర్జిత సేవల టికెట్లు విడుదల

12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే.. టికెట్లు మంజూరవుతాయి. 21న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను విడుదల చేయనున్నారు. 23న ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. 24 ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అదే రోజు.. మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటాను విడుదల చేస్తారు. భక్తులు https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని తితిదే అధికారులు సూచించారు.

# ఎలాంటి తప్పు చేయలేదు.. నిర్దోషిగా బయటకు వస్తా

డిన్నర్‌కు హాజరైన మాట నిజం. ఎలాంటి తప్పు చేయలేదు.. నిర్దోషిగా బయటకు వస్తాననే నమ్మకముంది. పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తా. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు నడుచుకుంటా. ఘటనపై అధిష్ఠానానికి వివరణ ఇస్తా" అని తెలిపారు.

# గాయపడిన సైనికుడిని పరామర్శించిన రాహుల్

కోబ్రా బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ అజయ్ మాలిక్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. దేశ సేవలో గాయపడిన సైనికుడికి ధైర్యం చెప్పి ఆయన త్యాగాన్ని ప్రశంసించారు. అజయ్ మాలిక్ ఝార్ఖండ్‌లో నక్సల్ వ్యతిరేక చర్యల్లో పాల్గొంటున్న సమయంలో ఐఈడీ పేలుడు సంభవించింది. ఆ పేలుడులో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. తీవ్ర గాయాల కారణంగా వైద్యులు ఆయన కాలును తొలగించాల్సి వచ్చింది. ప్రస్తుతం ఆయన చికిత్స అనంతరం కోలుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ ఆయనను ప్రత్యక్షంగా కలసి పరామర్శించారు. దేశ భద్రత కోసం ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్న సైనికుల త్యాగం ఎప్పటికీ మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. దేశ సేవలో గాయపడిన సైనికుల ధైర్యం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తుందని అన్నారు. అజయ్ మాలిక్ చూపిన ధైర్యసాహసాలు దేశానికి గర్వకారణమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. విధి నిర్వహణలో గాయపడినా దేశ సేవ పట్ల ఆయన చూపిన నిబద్ధతను ఆయన కొనియాడారు. ఇటువంటి సైనికుల త్యాగం వల్లే దేశం సురక్షితంగా ఉందని అన్నారు. దేశ రక్షణ కోసం కృషి చేస్తున్న భద్రతా దళాల సిబ్బందికి ప్రభుత్వం, సమాజం మరింత మద్దతు ఇవ్వాలని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. దేశ సేవలో గాయపడిన సైనికులను గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

# కోర్టులో లొంగిపోయిన సిద్ధార్థరెడ్డి

పొందుతూ ప్రత్యూష మృతి చెందగా.. అతడు కోలుకున్నాడు. ప్రత్యూషది ఆత్మహత్య కాదు.. హత్య అంటూ ఆమె తల్లి న్యాయపోరాటం చేశారు. ఆమె ఆత్మహత్య చేసుకునేలా సిద్ధార్థరెడ్డి ప్రేరేపించారని ట్రయల్ కోర్టు గతంలో తీర్పునిచ్చింది. ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ శిక్షను హైకోర్టు రెండేళ్లకు తగ్గించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ.. సిద్ధార్థరెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు తీర్పును సమర్థిస్తూ.. ఇటీవల పిటిషన్‌ను కొట్టేసింది. నాలుగు వారాల్లోగా సిద్ధార్థరెడ్డి లొంగిపోవాలని ఆదేశించింది. ఈ మేరకు అమెరికాలో ఉన్న అతడు తిరిగి వచ్చి.. నాంపల్లి కోర్టులో లొంగిపోయాడు. ప్రత్యూష, సిద్ధార్థరెడ్డి హైదరాబాద్ ఎస్ఆర్‌నగర్‌లోని ఓ కాలేజీలో ఇంటర్ చదువుతున్నప్పుడు ప్రేమలో పడ్డారు. ఇంటర్ పూర్తయిన తర్వాత సిద్ధార్థరెడ్డి ఇంజినీరింగ్‌కు వెళ్లగా, ప్రత్యూష సినిమాల్లోకి వెళ్లారు. ఇద్దరి వివాహానికి ప్రత్యూష తల్లి మొదట వ్యతిరేకించినా తర్వాత అంగీకరించారు. సిద్ధార్థరెడ్డి తల్లి మాత్రం ఆ అమ్మాయిని పెళ్లిచేసుకుంటే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించడం వారి వివాహానికి అడ్డంకిగా మారింది. ఆ విషయాన్ని సిద్ధార్థరెడ్డి 2002 ఫిబ్రవరి 23న ఫోన్‌ద్వారా ప్రత్యూషకు చెప్పాడు. సాయంత్రం 5 గంటల సమయంలో పంజాగుట్టలో బ్యూటీపార్లర్‌లో ఉన్న ప్రత్యూషను వెంటబెట్టుకొని కారులో బయటికి వెళ్లాడు. రాత్రి 7.30–8 గంటల మధ్యలో ఇద్దరూ ప్రాణాపాయస్థితిలో బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రికి వచ్చి చేరారు. ప్రత్యూష 24వ తేదీన కన్నుమూశారు. సిద్ధార్థరెడ్డి మార్చి 9న డిశ్చార్జి అయ్యాడు.

# ఏ సంబంధం లేదు

అవకాశం లభించింది" అని అజార్ పేర్కొన్నారు. తొమ్మిదేళ్ల తర్వాత ఫిబ్రవరి 25–26 తేదీల్లో భారత ప్రధాని ఇజ్రాయెల్‌లో పర్యటించారు. ఆ సందర్భంగా బెంజమిన్ నెతన్యాహుతో పలు అంశాలపై చర్చలు జరిపారు. ఆ తర్వాత రెండు రోజులకు ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్–అమెరికా సంయుక్తంగా ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపై ఇటీవల కాంగ్రెస్ విమర్శలు చేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల పెరుగుదలకు భారత్ మద్దతు ఉందన్న భావన ప్రధాని పర్యటన కలిగిస్తోందని హస్తం పార్టీ నేత సల్మాన్ ఖుర్షీద్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

**నెతన్యాహు జీవించే ఉన్నారు..**

నెతన్యాహు ప్రాణాలు కోల్పోయారంటూ నెట్టింట్లో ప్రచారం జరుగుతోంది. దానిని అజార్ తోసిపుచ్చారు. తమ ప్రధాని జీవించే ఉన్నారని వెల్లడించారు. ఆయన ఒక కాఫీ షాప్‌నకు వెళ్లిన వీడియో ఏఐది కాదని, నిజమైనదేనని తెలిపారు. ఈ యుద్ధం వేళ పెద్దఎత్తున అసత్య ప్రచారం చక్కర్లు కొడుతోందన్నారు.

**అలీ ఖమేనీ విమానం ధ్వంసం: ఇజ్రాయెల్ వెల్లడి**

ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. నిన్న రాత్రి మెహ్రాబాద్ ఎయిర్‌పోర్ట్‌పై జరిగిన దాడిలో మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా ఖమేనీకి చెందిన వ్యక్తిగత విమానం ధ్వంసమైనట్లు నెతన్యాహు సేనలు వెల్లడించాయి.

# విమానాలు రద్దు

ఈమేరకు విమాన సర్వీసులు రద్దయ్యాయి. ప్రస్తుత సంక్షోభ సమయంలో విమానయాన కార్యకలాపాల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం. పౌర విమానయానశాఖ, డీజీసీఏలు పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాయి. అవకాశం లభించినప్పుడల్లా విమానాలు నడుపుతున్నాం. ఇలా ఇప్పటివరకు దాదాపు 2.19 లక్షల మందిని చేరవేశాం. ఇప్పటికీ కొన్ని గగనతలాలు మూసిఉన్నాయి. అవి అందుబాటులోకి వచ్చి, సురక్షిత పరిస్థితులు ఏర్పడినప్పుడే విమానాల రాకపోకలు సాధారణ స్థితికి చేరుకోగలవు" అని ప్రశ్నోత్తరాల సమయంలో ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సమాధానం ఇచ్చారు. గతేడాది డిసెంబరులో ఇండిగో విమానాలు పెద్దసంఖ్యలో రద్దయిన వ్యవహారంలో.. ప్రయాణికులకు ట్రావెల్ కూపన్ల రూపంలో రూ.163.92 కోట్ల మేర పరిహారం ఇప్పటికే అందినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రయాణికులకు మరింత పరిహారం చెల్లించేలా విమానయాన సంస్థతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు.

# ఎడిటర్ వాయిస్

## పుట్టా మహేష్ ఎపిసోడ్.. టీడీపీ సైలెంట్.. రీజనేంటి?

ఏలూరుకు చెందిన టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ హైదరాబాద్ లో ఒక డ్రగ్స్ కేసులో ఇరుక్కోవడం టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ఒక్కసారిగా కదిలించింది. ప్రత్యేకంగా టీడీపీలో చూస్తే కనుక ఇది అతి పెద్ద షాకింగ్ గా మారింది. డ్రగ్స్ కేసులో సామాన్య నాయకుడు ఎవరైనా ఇరుక్కుంటే ఆ కథ వేరు, కానీ ఒక పార్లమెంట్ సభ్యుడు ఇందులో ఉన్నారు అన్న ప్రచారం దాని మీద ఆరోపణలు ఇవన్నీ చూసినపుడు తెలుగుదేశం పార్టీలో ఇది అతి పెద్ద చర్చలు దారి తీస్తోంది. అంతర్గతంగానే తీవ్ర స్థాయిలో ఈ ఇష్యూ మీద నాయకుల మధ్య చర్చ సాగుతోంది అని అంటున్నారు.

కడప నుంచి తెచ్చి: ఇదిలా ఉంటే ఎక్కడో కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన పుట్టా మహేష్ కి గోదావరి జిల్లాలలో గుండె కాయ లాంటి ఏలూరు పార్లమెంట్ సీటు ఇవ్వడమే పెద్ద తప్పు అన్నట్లుగా కూడా పార్టీలో అంతర్గత చర్చ సాగుతోంది అని అంటున్నారు. గోదావరి జిల్లాలో ఉన్న స్థానికులను కాదని ఈ సీటు ఎలా ఇస్తారు అని ఆనాడే పార్టీలో ఒక అసంతృప్తి అయితే వ్యక్తం అయింది. కానీ అది ఇపుడు మరోసారి గట్టిగా చర్చకు దారి తీసే స్థాయిలో వినిపిస్తోంది అని అంటున్నారు. స్థానికంగా రెండు సార్లు ఎంపీగా ఎమ్మెల్యేగా గెలిచిన మాగంటి బాబు లాంటి పెద్ద నాయకులు ఉండగా వలసవాదులకు టికెట్లు ఇవ్వాలనుకోవడమే అధిష్టానం నాడు తీసుకున్న ఒక రాంగ్ డెసిషన్ అని చర్చ కూడా సాగుతోంది అంటున్నారు. ఏరి కోరి ఆయనను తెచ్చి మరీ టికెట్ ఇవ్వడం ద్వారానే ఇపుడు ఇబ్బందులు పడాల్సి వస్తోంది అన్న కోణంలోనూ చర్చ సాగుతోంది అని అంటున్నారు.

కుట్ర జరిగిందా : ఇదిలా ఉంటే టీడీపీ అభిమానులు యాక్టివిస్టులు కొంతమంది అయితే సోషల్ మీడియాలో మాత్రం పుట్టా మహేష్ ని సమర్థిస్తూ పోస్టులు పెడుతున్నారు. ఈ విషయంలో మహేష్ కి అన్యాయం జరుగుతోందని, ఆయన బీసీ నేత కావడం వల్లనే ఈ రకంగా చేస్తున్నారు అని కూడా అంటున్నారు. అయితే ఈ కేసు విషయంలో మాత్రం టీడీపీకి అంతా ఇరకాటమైన పరిస్థితి ఉందని అంటున్నారు బయటకు నేతలు ఎవరూ బాహాటంగా ఏదీ చెప్పలేని పరిస్థితి ఉందని అంటున్నారు. ఎలా రియాక్ట్ కావాలి అన్నది కూడా ఎవరికీ అర్థం కావడం లేదని అంటున్నారు.

పార్టీకే ట్రబుల్గా : మరో వైపు చూస్తే టీడీపీని అభిమానించే వారి వాదన మరోలా ఉంది. కొందరినాయకులు చేసే తప్పులు పొరపాట్ల వల్లనే పార్టీకి ఇబ్బందులు వస్తున్నాయని అంటున్నారు. అయినా సరే ఇది సున్నితమైన అంశంగానే పార్టీలో ఉందని చెబుతున్నారు. బీసీ నేత యువ నాయకుడు, మరో సీనియర్ నేతకు బంధువు ఇలా పుట్టా మహేష్ చుట్టూ చాలా విషయాలు కోణాలు ఉన్నాయి. దాంతో ఎవరూ బయటపడి గట్టిగా అనే పరిస్థితి లేదని కూడా గుర్తు చేస్తున్నారు. అదే సమయంలో బీసీ నేత మీదకు గురి పెడతారా అని వైసీపీ లాంటి ప్రత్యర్థి పార్టీల మీద విరుచుకు పడాలనుకున్నా ఈ కేసు క్లియర్ కట్ గా ఇపుడు కనిపిస్తోంది అని అంటున్నారు.

బెయిల్ ఇచ్చినా కూడా : ఇక ఈ కేసు విషయంలో ఎంపీగా పుట్టా మహేష్ కి పోలీసులు తాత్కాలికంగా బెయిల్ ఇచ్చారని అంటున్నారు. ఎందుకు అంటే ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయి. కాబట్టి ఎంపీగా సభకు హాజరయ్యేందుకు ఆయనకు ఈ బెయిల్ వచ్చింది అని చెబుతున్నారు. అయితే ఈ మొత్తం ఎపిసోడ్ లో పార్టీగా టీడీపీయే కార్నర్ అవుతోంది అని అంటున్నారు సమాధానం చెప్పుకోలేని స్థితిలోకి పార్టీ వెళ్తోంది అన్న ఆవేదన కూడా చాలా మంది పార్టీ నేతలలో ఉంది. అందుకే



పార్టీలో ఒక రకమైన సైలెంట్ కనిపిస్తోంది అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే ఈ తరహా పరిణామాలతో టీడీపీ కానీ కూటమి నేతలు కానీ ప్రస్తుతానికి మౌనంగానే ఉంటూ వస్తున్నారు. ఈ ఇష్యూలో ఏమి జరుగుతుంది ఎటు మలుపు తిరుగుతుంది అన్నది అయితే చూడాల్సి ఉందని అంటున్నారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## ప్రాణాలు తీసిన వాహన పొగ.. నిద్రలోనే నలుగురి మృతి



పుంగనూరు, విశ్వం వాయిస్ న్యూస్ : అన్నమయ్య జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. రాత్రి నిద్రకు ఉపక్రమించిన ముగ్గురు పిల్లలు, వారి తాత నిద్రలోనే ప్రాణాలు కోల్పోయారు. పుంగనూరు త్యాగరాజ వీధికి చెందిన బజంత్రి మురళి, రేవతి దంపతులకు నలుగురు పిల్లలు. పెద్ద కుమార్తె సుమబిందు, కుమారుడు కార్తిక్ (13), ఇద్దరు కవల పిల్లలు చరిత, చందన (6) ఉన్నారు. రెండు రోజులు సెలవు కావడంతో సుమబిందు మేనత్త ఇంటికి వెళ్లింది. మురళి ద్విచక్రవాహనం మొరాయిస్తుండటంతో మరమ్మతు చేయించి శనివారం ఇంటికి తీసుకొచ్చాడు. మెకానిక్ సలహా మేరకు రాత్రంతా ఇంజిన్ ఆన్ చేసి వాహనాన్ని ఇంట్లో పెట్టాడు. అదే గదిలో కార్తిక్, చరిత, చందనతో పాటు వారి తాత రామచంద్ర (74) నిద్రించారు. దంపతులిద్దరూ మేడపై పడుకున్నారు. ఉదయం లేచేసరికి తలుపులు తీయకపోవడంతో పగలగొట్టారు. అప్పటికే నలుగురూ విగతజీవులుగా పడి ఉన్నారు. రాత్రంతా ఇంజిన్ ఆన్ చేసి ఉండటంతో కార్బన్ మోనాక్సైడ్ ఇల్లంతా నిండిపోయింది. వారు నిద్రలో పొగ పీల్చడంతో అపస్మారక స్థితికి చేరుకుని మృత్యువాత పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. సీఐ సుబ్బరాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసులు నమోదు చేశారు.

## కూలీల బతుకులను చిదిమేసిన లారీ

### ఆగి ఉన్న ఆటోను ఢీకొనడంతో ముగ్గురి దుర్మరణం



నాంపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ : వలస కూలీల బతుకులను ఓ లారీ చిదిమేసింది. ఆగిఉన్న ఆటోను ఓ లారీ ఢీకొనడంతో ముగ్గురు మృతిచెందారు. ఈ ప్రమాదం నల్గొండ జిల్లా నాంపల్లి మండలం రేక్యాతండా పంచాయతీ పరిధిలోని ఆవాస గ్రామ వస్రాంతండా సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. 13 మంది ప్రయాణికులతో కొండమల్లేపల్లి నుంచి చింతపల్లికి వెళుతున్న ఆటో వస్రాంతండా వద్ద ప్రయాణికులను దింపేందుకు ఆగింది. అదే సమయంలో మాచర్ల నుంచి హైదరాబాద్‌కు ఇటుకల లోడ్‌తో వెళుతున్న లారీ అదుపుతప్పి ఆగిఉన్న ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో చింతపల్లి మండలంలో కోళ్ల ఫారంలో పనిచేస్తున్న బిహార్‌కు చెందిన సంతోష్ కలీఫా(40) అక్కడికక్కడే మృతి చెందగా.. చింతపల్లి మండలం కొర్రమాన్‌సింగ్ తండాకు చెందిన ఆటో డ్రైవర్ కొర్ర బాధ్య(57), చింతపల్లిలోని ఓ తోటలో పనిచేసే ఏపీలోని బాపట్లకు చెందిన బండారు ఇసాక్(55) ఆసుపత్రికి తరలిస్తుండగా చనిపోయారు. ఆటోలో ప్రయాణిస్తున్న 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆదివారం దేవరకొండ అంగడి కావడంతో నిత్యావసరాల కోసం వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

## మృత్యువై దూసుకొచ్చిన లారీ

**ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగి ఉన్న వాహనాలపైకి వెళ్లడంతో ఘోరం - ఇద్దరి మృతి.. ఒకరికి గాయాలు**

**విశాఖలో రెండు కుటుంబాల్లో పెను విషాదం - ప్రమాదానికి కారణమైన లారీ**



విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ : కుమార్తెకు సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు.. ఆమెతో కలిసి ఇష్టదైవం సింహాద్రి అప్పన్న దర్శనానికి బైకుపై బయలుదేరారు ఆ తండ్రి. వచ్చేనెలలో పెళ్లి జరగనుండగా కాబోయే అత్తవారింటికి వచ్చి తిరిగి వెళ్తున్నారు ఆ యువకుడు.. అంతలోనే దూసుకొచ్చిన లారీ వారిద్దరినీ పొట్టన పెట్టుకుంది. విశాఖపట్నంలో ఆదివారం ఉదయం సంభవించిన ఈ ఘోరం రెండు కుటుంబాల్లో పెనువిషాదాన్ని నింపింది. విశాఖ బీహెచ్‌పీవీ కూడలిలో రెడ్‌లైట్ సిగ్నల్ పడటంతో కారు, దాని వెనుక వరుసగా 3 బైకులు ఆగాయి. అంతలో ఓ లారీ మితిమీరిన వేగంతో దూసుకొచ్చింది. బైకులను, కారును వెనుక నుంచి ఢీకొట్టింది. కారును 50 మీటర్ల మేర ఈడ్చుకెళ్లి ఆగింది. ఒక బైకుపై అనకాపల్లి జిల్లా మంగళపురానికి చెందిన బొబ్బిలి సతీష్(30) ఉన్నారు. లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే చనిపోయారు. ఓ ఫైనాన్స్ బ్యాంక్‌లో పనిచేసే సతీష్‌కు వచ్చేనెల 11న వివాహం జరగాల్సి ఉంది. శనివారం అత్తారింటికి వచ్చి ఆదివారం ఉదయం తిరిగి వెళ్తూ ప్రమాదానికి బలయ్యారు.

**ప్రమాదం సంభవించిన కూడలి – స్వామి దర్శనానికి వెళ్తూ...**

మరో బైకుపై శ్రీనగర్ దిబ్బపాలేనికి చెందిన కోరాడ రామకృష్ణ(50), ఆయన కుమార్తె అనుపమ ఉన్నారు. రామకృష్ణ వరుణ్ బజాజ్‌లో సూపర్‌వైజర్. అనుపమకు సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ఉన్నాయి. సింహాద్రి అప్పన్నను దర్శించుకొని హాల్‌టికెట్‌ను స్వామి పాదాల చెంత ఉంచేందుకు వారు బైకుపై బయలుదేరారు. ప్రమాదంలో అనుపమ రోడ్డుకు అటువైపు పడటంతో ప్రాణాపాయం తప్పింది. రామకృష్ణ తల మీదుగా లారీ వెళ్లడంతో ఆయన చనిపోయారు. మూడో బైకుపై ఉన్న రవికి స్వల్ప గాయాలయ్యాయి. కారు వెనుక భాగం నుజ్జయింది. అందులోని ఐదుగురూ ప్రాణాలతో బయటపడ్డారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ త్రుటిలో తప్పించుకున్నారు.

## ఆరేళ్ల బాలికపై అత్యాచారం

హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : నగరంలోని నార్సింగిలో దారుణం చోటుచేసుకుంది. ఓ కామాంధుడు.. ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేశాడు. చాక్లెట్ ఇప్పిస్తానంటూ బాలికను నమ్మించి అత్యాచారం చేసి ప్రాణాలు తీశాడు. చిన్నారి ఆదివారం సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో రాత్రి 10 గంటలకు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్‌లో బాలికను కామాంధుడు తీసుకెళ్తున్న దృశ్యాలను గుర్తించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## కారు ఆపడమే శాపం..

### కంటైనర్ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు



శామీర్‌పేట, విశ్వం వాయిస్ న్యూస్ : రోడ్డు పక్కన భోజనం కోసం కారు ఆపడమే వారి పాలిట శాపమైంది. కంటైనర్ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఓఆర్‌ఆర్ పక్కన కారు నిలిపి భోజనం చేస్తున్న సమయంలో వెనుక నుంచి కంటైనర్ ఢీ కొట్టడంతో.. కారులో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మృతులను మౌలాలికి చెందిన మహ్మద్ యూసుఫ్ ఖాన్ (51), కాప్రా సాకేత్‌కు చెందిన హుస్సేన్ (53)గా గుర్తించారు. మద్యం మత్తులో కంటైనర్ నడిపిన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## హైదరాబాద్ ఫరూక్‌నగర్‌లో అగ్నిప్రమాదం



చాంద్రాయణగుట్ట, విశ్వం వాయిస్ న్యూస్ : హైదరాబాద్ ఫలక్‌నుమా పరిధిలోని ఫరూక్‌నగర్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానిక బస్‌డిపో పక్కన ఉన్న దుకాణంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. క్రమంగా అవి పక్కనున్న ఫర్నిచర్ షాపు, ఇతర దుకాణాలకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిపమాక సిబ్బంది సంఘటన స్థలికి చేరుకొని మంటలు ఆర్పుతున్నారు. పక్కనే ఇండేన్ గ్యాస్ గోదాం ఉండటంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమయ్యారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## చెరువులో ఈతకు వెళ్లి ముగ్గురి మృతి

గండిపేట, విశ్వం వాయిస్ న్యూస్ : రంగారెడ్డి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. గండిపేట మండలం ఇస్తాం చెరువులో ఈతకు వెళ్లి ముగ్గురు యువకులు మృతిచెందారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. చెరువులో గాలింపు చేపట్టి ముగ్గురి మృతదేహాలను బయటకు తీశారు. మృతిచెందిన వారిని ఇబ్రహీంబాగ్ చెందిన కార్తీక్ (25), గోవర్ధన్ (23), వెంకటేశ్ (25)గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మహిళపై సామూహిక హత్యాచారం..

### నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష

కడియం, విశ్వం వాయిస్ న్యూస్ : తూర్పుగోదావరి జిల్లా కడియంలో 2024లో మహిళపై జరిగిన సామూహిక హత్యాచారం కేసులో రాజమహేంద్రవరం జిల్లా కోర్టు కీలక తీర్పు వెలువరించింది. నలుగురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. మహిళ నర్సరీలో పని ముగించుకొని ఇంటికి వెళ్తుండగా.. నిందితులు అత్యాచారం చేసి చంపేశారు. అనంతరం మృతదేహాన్ని కాలువలో పడేశారు. ఈ కేసుపై పలు దశల్లో విచారణ చేపట్టిన న్యాయస్థానం నిందితులు నలుగురికీ యావజ్జీవ కారాగార శిక్ష ఖరారు చేసింది.

## భారీగా పెరగనున్న వెండి ధరలు!



ఇటీవలి బంగారం, వెండి ధరల భారీ హెచ్చుతగ్గులు జ్యువెలరీ వ్యాపారాన్ని కుదిపేశాయి. వెండి ధర కిలోకు రూ.2.9 లక్షలకు చేరడం, 2026 నాటికి రూ.4 లక్షలు దాటే అవకాశం ఉండటంతో కొనుగోళ్లు తగ్గి వ్యాపారులు నష్టపోతున్నారు. మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు ధరల పెరుగుదలకు కారణం. ఇండియాలో గోల్డ్, సిల్వర్ ధరల్లో ఇటీవలి కాలంలో జరిగిన భారీ హెచ్చుతగ్గులు జ్యువెలరీ బిజినెస్‌పై ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా సిల్వర్ ధరల పెరుగుదల కారణంగా మార్కెట్‌లో అనిశ్చితి నెలకొంది. 2026 జనవరిలో సిల్వర్ ధరలు రికార్డు స్థాయికి చేరుకుని కిలోకు సుమారు రూ.2.9 లక్షల వరకు పెరిగాయి. ధరలు ఎక్కువగా ఉండటంతో కస్టమర్లు కొనుగోళ్లకు వెనుకంజ వేస్తుండటంతో, ముఖ్యంగా వెడ్డింగ్ సీజన్‌లో కూడా సేల్స్ తగ్గుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు కూడా ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి. ఇరాన్, యునైటెడ్ స్టేట్స్, ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న కాన్ఫ్లిక్ట్ కారణంగా గ్లోబల్ మార్కెట్‌లో గోల్డ్, సిల్వర్ ధరలు పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. ఆల్ ఇండియా జెమ్స్ అండ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ చైర్మన్ రాజేష్ రోక్డే ప్రకారం, పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే వచ్చే ఏడాది సిల్వర్ ధర కిలోకు రూ.4 లక్షలకు పైగా చేరే అవకాశముంది. ఇటీవలే ధరలు రూ.3 లక్షల స్థాయిని చేరుకునే ప్రయత్నం చేశాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇంటర్నేషనల్ మార్కెట్ ధరలను నేరుగా నియంత్రించలేనప్పటికీ, ఇంపోర్ట్ కస్టమ్స్ డ్యూటీ తగ్గించడం ద్వారా కొంత ఉపశమనం కల్పించవచ్చని వ్యాపారులు సూచిస్తున్నారు. ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని సుమారు 2 శాతం తగ్గిస్తే జ్యువెలరీ బిజినెస్‌కు గణనీయమైన ఊరట లభిస్తుందని వారు అంటున్నారు. ఇదే సమయంలో నగల వ్యాపారుల సంస్థ అయిన రాష్ట్రీయ స్వర్ణార్ సంఘ్ నిర్వహించిన ఎమర్జెన్సీ మీటింగ్‌లో కొత్త స్ట్రాటజీ రూపొందించారు. ఆ సమావేశంలో బీహార్‌లోని ఖగారియా ఎంపీ రాజేష్ వర్మను సంస్థ కొత్త ప్రెసిడెంట్‌గా ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ జ్యువెలరీ వ్యాపారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో ఒకటి కొన్ని లీగల్ ప్రొవిజన్ల దుర్వినియోగమని తెలిపారు. ప్రత్యేకంగా ఇండియన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్ 317 (పాత చట్టంలోని సెక్షన్ 411) కింద కొంతమంది పోలీసులు వేధింపులు చేస్తున్నారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. కస్టమర్లు తమ పాత గోల్డ్ లేదా సిల్వర్ అమ్మడానికి తీసుకొచ్చినప్పుడు, ఆ వస్తువు అసలు సోర్స్ ఏమిటో జ్యువెలర్లకు తెలియదని వారు చెబుతున్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం సెంట్రల్ గవర్నమెంట్, స్టేట్ గవర్నమెంట్ల జోక్యాన్ని కోరుతూ జ్యువెలరీ అసోసియేషన్లు చర్యలు ప్రారంభించాయి. అలాగే ప్రైమ్ మినిస్టర్ విశ్వకర్మ యోజన కింద గోల్డ్ స్మిత్‌లకు తగిన బెనిఫిట్స్ అందేలా చూడాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే ఢిల్లీలో పెద్ద ఎత్తున ప్రొటెస్ట్ నిర్వహించాలనే నిర్ణయం కూడా తీసుకున్నట్లు వ్యాపార సంఘాలు తెలిపాయి.

## ఏప్రిల్ 1 నుంచి కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ రూల్స్..

### మారనున్న నిబంధనలు ఇవే.. తప్పక తెలుసుకోండి..

# బిజినెస్ వాయిస్

ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ రూల్స్ అమల్లోకి రానున్నాయి. వీటి గురించి ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లింపుదారులే కాకుండా దేశ ప్రజలందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. దేశ ప్రజలందరినీ ఈ కొత్త నియమాలు ప్రభావం చేయనున్నాయి. మరికొద్ది రోజుల్లో కొత్త ఆర్థిక సంవత్సరం వస్తున్న క్రమంలో కొత్త ఆదాయపు పన్ను నియమాలు అమల్లోకి రానున్నాయి. పన్ను చెల్లింపులను సులభతరం చేయడానికి కేంద్రం ప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో కొత్త రూల్స్‌ను ప్రవేశపెట్టింది. టీసీఎస్ రేట్ల పెంపు, ఎస్‌టీటీ పెంపు, ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు గడువు పొడిగింపు వంటి నిర్ణయాలు ఉన్నాయి. దేశ ప్రజల ఆర్థిక పరిస్థితులపై ప్రభావం చేపే ఈ కీలక విషయాలు గురించి తెలుసుకుందాం.

**కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ యాక్ట్ 2025**

కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ప్రస్తుతం ఉన్న ఇన్‌కమ్ ట్యాక్స్ యాక్ట్ 1961 స్థానంలో ఇది రానుంది. కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ చట్టంలో ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయడం సులువు కానుంది. పేపర్‌లెస్ విధానాన్ని సామాన్యులకు కూడా అర్థమయ్యే భాషలో ప్రవేశపెట్టనుంది.

**రిటర్న్ గడువు పొడిగింపు**

ఆడిట్ చేయని పన్ను చెల్లింపుదారులు ఐటీఆర్-3, ఐటీఆర్-4 దాఖలు చేసేందుకు గడువు తేదీని పొడిగించారు. ఆగస్ట్ 31వ తేదీ వరకు కేంద్రం గడువు ఇచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కూడా సవరించిన గుడువు వర్తించనుంది. అయితే ఐటీఆర్-1, ఐటీఆర్-2 దాఖలు చేసేందుకు జులై 31 వరకు గడువు ఇచ్చారు.

**టీసీఎస్ మార్పులు**

పన్ను చెల్లింపుదారుల్లో గందరగోళాన్ని పరిష్కరించడానికి, పన్ను వాపస్ జాప్యాలను తగ్గించడానికి ఇటీవల బడ్జెట్‌లో కేంద్రం టీసీఎస్ రేట్లలో మార్పులు చేసింది. కొత్త టీసీఎస్ రేట్లు ఏప్రిల్ 2026 నుంచి అమల్లోకి రానున్నాయి. ఆల్కహాలిక్ పానీయాలపై టీసీఎస్ రేట్లు 1 నుంచి 2 శాతానికి పెంచారు. ఇక టెండు ఆకుల అమ్మకంపై 5 శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇక స్క్రాప్ అమ్మకంపై టీసీఎస్ రేటును 1 శాతం నుంచి 2 శాతానికి పెంచారు. ఇక ఖనిజాల




అమ్మకంపై 1 నుంచి 2 శాతానికి పెంపు జరిగింది. ఇక విదేశీ టూర్ ప్యాకేజీలపై 5 నుంచి 2 శాతానికి సవరించారు. విద్య, వైద్య చికిత్స కోసం 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించారు.

**ఎస్‌టీటీ పెంపు**

ఇక భారత స్టాక్ మార్కెట్లలోని ఫ్యూచర్స్, ఆప్షన్స్ ట్రేడర్లకు సెక్యూరిటీ లావాదేవీల పన్నును పెంచింది. ఫ్యూచర్లపై ఎస్‌టీటీని 0.2 శాతం నుంచి రూ.0.05 శాతానికి పెంచారు. ఇక ఆప్షన్ లావాదేవీలపై 0.1 శాతం నుంచి 0.15 శాతానికి పెంచారు.

**డివిడెండ్ల ఆదాయం**

ఏప్రిల్ 2026 నుండి పన్ను చెల్లింపుదారులు డివిడెండ్ ఆదాయాన్ని సంపాదించడానికి లేదా మ్యూచువల్ ఫండ్ యూనిట్ల నుండి ఆదాయాన్ని సంపాదించడానికి అయ్యే వడ్డీ ఖర్చులను తగ్గించుకోలేరు. గతంలో అనుమతించబడిన వడ్డీ వ్యయాల తగ్గింపులు తొలగించబడ్డాయి. అంటే డివిడెండ్ ఆదాయం వర్తించే స్లాబ్ రేట్ల వద్ద పూర్తిగా పన్ను విధించబడుతుంది. మునుపటి 20% వడ్డీ తగ్గింపు పరిమితిని తొలగిస్తుంది.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...





కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

మంగళవారం, 17 మార్చి 2026

www.viswamvoice.com




తెలుగువారి ఆత్మగౌరవం కోసం రెండు నెలల పాటు

## ఆమరణ నిరాహార దీక్ష చేసిన వ్యక్తి పొట్టి శ్రీరాములు : ఎమ్మెల్యే శిరీష



**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆంధ్ర ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వారికి తెలుగు ప్రజలు ఎప్పటికప్పుడు గుర్తుంచుకునే బాధ్యత మన అందరిపై ఉందని రంపచోడవరం శాసనసభ్యులు, లెజిస్లేటివ్ చైర్మన్ శ్రీమతి మిరియాల శిరీష దేవి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఆంధ్ర కేసరి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా పొట్టి శ్రీరాములు వారి చిత్రపటానికి రంపచోడవరం శాసనసభ్యులు లెజిస్లేటివ్ చైర్మన్ శ్రీమతి మిరియాల శిరీష, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత, ఎంపీపీ శ్రీమతి బంధం శ్రీదేవి, జడ్పిటిసి సభ్యురాలు శ్రీమతి పండ వెంకటలక్ష్మి, రంపచోడవరం పంచాయతీ సర్పంచ్ మంగ బొజ్జయ్య, ఎపిఓ జనరల్ డిఎన్వి రమణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంపచోడవరం శాసనసభ్యులు, లెజిస్లేటివ్ చైర్మన్ శ్రీమతి మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ ఆంధ్ర కేసరి పొట్టి శ్రీరాములు వారు 1901 మార్చి 16న నెల్లూరు గ్రామంలో జన్మించారని అదేవిధంగా 1952 డిసెంబర్ 15వ తేదీన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం నిరాహార దీక్ష చేసి అమరులైనారని ఆమె అన్నారు. పొట్టి శ్రీరాములు వారికి అమరజీవి ఆంధ్ర జాతిపిత బిరుదు కలదని ఆమె అన్నారు. భారతదేశానికి స్వతంత్రం కోసం క్విట్ ఇండియా ఉద్యమంలో ఉప్పు సత్యాగ్రహం మొదలగు స్వాతంత్ర ఉద్యమాలలో పాల్గొన్నారనీ ఆమె అన్నారు. అదేవిధంగా జాతిపిదిత మహాత్మా గాంధీకి పొట్టి శ్రీరాములు వారు ప్రియ మిత్రుడు అని ఆమె అన్నారు. తెలుగువారిపై తమిళ్యుల నిరంకుశ వైఖరిని వ్యతిరేకిస్తూ తెలుగు ప్రజలకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని బులుసు సాంబమూర్తి ఇంటి వద్ద నిరాహార దీక్ష 58 రోజులపాటు చేయడం జరిగిందని అదేవిధంగా 1952 డిసెంబర్ 15వ తేదీన మరణించారని మరణంతో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని ఆమె అన్నారు. పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ మాట్లాడుతూ స్వతంత్రం వచ్చిన తర్వాత తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని నిరాహార దీక్ష చేసి అమరులైన పొట్టి శ్రీరాములు వారికి తెలుగు ప్రజలందరూ గుర్తుపెట్టుకునే బాధ్యత మన అందరిపై ఉందని ఆయన అన్నారు. ఆంధ్ర కేసరి పొట్టి శ్రీరాములు వారు 1901వ సంవత్సరం మార్చి 16వ తారీఖున నెల్లూరు గ్రామంలో జన్మించారని ఆయన అన్నారు అదేవిధంగా 1952 డిసెంబర్ 15వ తారీఖున తెలుగు ప్రజల కోసం, తెలుగువారి ఆత్మగౌరవం కోసం సుమారు రెండు నెలల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేయడం జరిగిందని ఆయన అన్నారు. పొట్టి శ్రీరాములు వారి ఆమరణ నిరాహార దీక్ష ఫలితమే ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ ఏర్పాటయిందని ఆయన అన్నారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ నెంబర్ గొర్లె సునీత మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం తెలుగు ప్రజల హక్కుల కోసం 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు వారికి తెలుగు ప్రజలందరూ ఎప్పటికప్పుడు స్మరించుకోవాలని ఆమె అన్నారు. పొట్టి శ్రీరాములు వారి ఆశయాలు మన ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత మన అందరిపై ఉందని ఆమె అన్నారు. ముందుగా మన గ్రామాలు, మన మండలాలు, మన జిల్లా, మన రాష్ట్రం, మన దేశాన్ని అభివృద్ధి చేసుకునే బాధ్యత ప్రతి భారతీయుడు పై ఉందని ఆమె అన్నారు. అదేవిధంగా ఎంపీపీ శ్రీమతి బంధం శ్రీదేవి, జడ్పిటిసి సభ్యురాలు శ్రీమతి పండ.వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగ బోజ్జయ్య, ఏఎంసీ చైర్మన్ లోత లక్ష్మణ్ పొట్టి శ్రీరాములు వారి ఆశయాలపై ప్రసంగించడం జరిగింది. అనంతరం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా వివిధ కార్యాలయాలకు సంబంధించిన అధికారులు సిబ్బంది పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అదేవిధంగా అమరావతి నుండి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు వారి ప్రసంగం, డిప్యూటీ ముఖ్యమంత్రి వారి ప్రసంగం వచ్చేవాళ్ళ ప్రోగ్రాం ద్వారా ప్రజలకు వినిపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ ఓ జనరల్ డిఎన్వి రమణ, తాసిల్దార్ పి. బాలాజీ,ఎంపీడీవో ప్రసాద్, ఐటీడీఏ పరిపాలన అధికారి ఎర్రంశెట్టి రాజు, డిప్యూటీ ఎంపీడీవో హరిబాబు,ఏపీవో బి. సత్యనారాయణ, ఏఎస్ఓ విజయ భాస్కర్, స్థానిక నాయకులు అడబాల బాపిరాజు, పండ చెల్లన్న దొర, గణపతి, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ సిహెచ్.నిర్మల, వీఆర్వోలు శివకుమార్, ఏ చిన్న రాజు, సూపర్వైజర్ జి.కుసుమ సచివాలయాలకు సంబంధించిన సిబ్బంది, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి – 2026 పబ్లిక్ పరీక్షలు ప్రశాంతం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మార్చి 16న సోమవారం తెలుగు పేపర్ జనరల్ మరియు కాంపోజిట్ 01T, 02T అండ్ 03 పరీక్ష. జరిగినది. కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ 01 పరీక్ష కేంద్రాన్ని, మరియు జిల్లా స్థాయి పరిశీలనాదికారి వారు 07 పరీక్షా కేంద్రాలను, జిల్లా పాఠశాల విద్యాశాఖాదికారి 04 పరీక్షా కేంద్రాలను, జిల్లా స్థాయి పరిశీలనాదికారి అసిస్టెంట్ కమిషనర్ ప్రభుత్వ పరీక్షల విభాగం మంగళగిరి వారు మరియు అసిస్టెంట్ కమిషనర్ ప్రభుత్వ పరీక్షల విభాగం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వారు సంయుత్తమంగా 08 పరీక్ష కేంద్రాలను మరియు తనిఖీ అధికార్లు (ఫ్లైయింగ్ స్క్వాడ్) 69 పరీక్షా కేంద్రాలును మొత్తం 88 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయడం జరిగినది. మొత్తం 24424 విద్యార్థులకు గాను 24166 మంది విద్యార్థులు హాజరయినారని మరియు ఎస్ ఎస్ సి ఏ పోస్ పరీక్షలు మార్చి 2026, 26 పరీక్షా కేంద్రాలలో తెలుగు 2392 విద్యార్థులకు గాను 1833 మంది విద్యార్థులు హాజరయినారని ఉర్దు.02 విద్యార్థులకు గాను 02 మంది విద్యార్థులు హాజరయినారని మరియు ఒరియా. 01 విద్యార్థి కి గాను 01 ఆబ్సెంట్ అని మరియు తనిఖీ అధికార్లు అన్నీ ఎస్ ఎస్ సి ఏ పోస్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినరాని మరియు పదవతరగతి రెగ్యులర్ తెలుగు, పరీక్ష అన్నీ 138 కేంద్రాలలోను మరియు ఎస్ ఎస్ సి ఏ పోస్ తెలుగు, ఉర్దు, మరియు ఒరియా పరీక్షలు అన్ని 26 పరీక్షా కేంద్రాలలోను ప్రశాంతంగా జరిగినదని జిల్లా పాఠశాల విద్యాశాఖాదికారి, తూర్పుగోదావరి జిల్లా కె. వాసుదేవరావు రాజమహేంద్రవరం,వారు ఒక ప్రకటనలో తెలియచేసినారు.

## ఆధ్యాత్మిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి దంపతులు

రూ.16 లక్షలతో జాంపేట రామాలయం వద్ద షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జాంపేట పోలీసు క్వార్టర్స్ ఆవరణలోని రామాలయం వద్ద 16,00,000 లక్షలు భవానీ చారిటబుల్ ట్రస్టు నిధులతో నిర్మించనున్న షెడ్డు నిర్మాణం కోసం ఆదిరెడ్డి దంపతులు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అయితేనే మంచి వాతావరణంతో సమాజం ముందుకు సాగుతుందన్నారు. భక్తుల సౌకర్యం కోసం ఇక్కడ షెడ్డు నిర్మిస్తామని తాము గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుని, ఈ రామాలయం అభివృద్ధికి భవానీ చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.16 లక్షలు కేటాయించామన్నారు. ఈ షెడ్డు పూర్తయితే, భక్తులు వర్షాలు, వేసవి నుంచి కాపాడుకుని సేవలు చేసుకోవచ్చన్నారు. ఇది స్థానిక పోలీసు కుటుంబాలు,పొరుగు ప్రజలకు మరింత సౌకర్యం అందిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ మాట్లాడుతూ, తమ కుటుంబం ఎప్పుడూ ప్రజాసేవలో ముందుండి, ఆధ్యాత్మిక విలువలను పాటిస్తూ పని చేస్తోందన్నారు. ఈ రామాలయం జాంపేట ప్రాంతంలో ఆధ్యాత్మిక కేంద్రంగా మారనుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమానికి మరో ముఖ్య అతిధిగా హాజరైన జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడుతూ షెడ్డు నిర్మాణం కోసం సహకారం అందించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. వీరిని ఆదర్శంగా తీసుకుని ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు దాతలు సహకారం అందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కాగా ఆలయ అర్చకులు ఆదిరెడ్డి దంపతులను పూర్ణ కుంభం, వేద మంత్రాలతో స్వాగతించారు. శంకుస్థాపన అనంతరం ఆలయంలో వారు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, పోలీసు అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు నిత్యస్మరనీయుడు

నగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా రాజమండ్రి అర్బన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక కోటగుమ్మం వద్ద గల పొట్టిశ్రీరాములు విగ్రహనికి అర్బన్ అధ్యక్షుడు బాలేపల్లి మురలీధర్,మాజీ పార్లమెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ టీకె విశ్వేశ్వరరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బెజవాడ రంగా రావు,కాంగ్రెస్ నాయకులతో కలసి అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీ రాములు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేయటం ద్వారా ఈ రాష్ట్రము ఏర్పడిందని ఆయన నిత్య స్మరనీయుడు అని అమరావతిలో ఆయన 58 అడుగుల విగ్రహం పెట్టడం సంతోషంచాల్సిన విషయం అని అన్నారు.అర్బన్ జిల్లా అధ్యక్షులు బాలేపల్లి మురలీధర్ మాట్లాడుతూ అమరజీవి లాంటి వ్యక్తి ఈనాటి యువతకు స్ఫూర్తి అని అమరజీవి ఆమరణ దీక్ష వల్లనే తెలుగు రాష్ట్రం ఏర్పడింది అని మనం అంతా అమర జీవి పొట్టి శ్రీరాములును నిత్యం స్మరిచాల్సిన వ్యక్తి అని ఆయన త్యాగం మరువలేనిదని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కూరగంటి శ్రీను,ఆర్ రాజు,మాదేటి బుజ్జి,ఏం పద్మావతి తదితర్లు పాల్గొన్నారు.

## తాడేపల్లి వైసిపి సమావేశంలో దూలం వెంకన్న బాబు



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** తాడేపల్లి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం వేదికగా వైసిపి పార్టీ అనుబంధం విభాగాల అధ్యక్షులు, వైసిపి ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణ రెడ్డి అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ పార్టీ పరిశీలకుల సమావేశంలో రాష్ట్ర వైసిపి కార్యదర్శి, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ వైసీపీ పరిశీలకులు దూలం వెంకన్నబాబు పాల్గొన్నారు. ఈయన తో పాటు నిడదవోలు నియోజకవర్గ వైసీపీ పరిశీలకులు గిరజాల బాబు, రంపచోడవరం నియోజకవర్గ వైసీపీ పరిశీలకులు నక్క రాజబాబు, గోపాలపురం నియోజకవర్గ వైసీపీ పరిశీలకులుతోట రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి గొందేసి శ్రీనివాసులు రెడ్డి, పార్టీ నాయకులు ముద్దాల అను పాల్గొన్నారు.

## ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానం

రక్తదానం చేసిన డాక్టర్ పెంటగట్ల మణికుమార్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజ సేవలో భాగంగా పవన్ కళ్యాణ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పెంటగట్ల మణికుమార్ రాజమండ్రి లోని ధన్వంతరి బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన సమక్షంలో పలువురు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పెంటగట్ల మణికుమార్ మాట్లాడుతూ, ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుందని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రాజానగరం మండలం కొండగుంటూరు గ్రామానికి చెందిన మణికుమార్ ఇప్పటివరకు వేలాది మందికి రక్తం అందించి ప్రాణదాతగా నిలిచారని తెలిపారు. ఎవరికైనా అత్యవసరంగా రక్తం అవసరం ఉందని తెలిసిన వెంటనే స్పందించి సహాయం చేయడం ఆయన ప్రత్యేకత అని స్థానికులు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు ఆరు వేల మందికి పైగా రోగులకు రక్తం అందించిన ఘనత ఆయనకు దక్కింది. థలసీమియా పిల్లలు, ఎయిడ్స్ బాధితులు, డయాలిసిస్ రోగులు, రోడ్డు ప్రమాదాల బాధితులు మరియు శస్త్రచికిత్సల సమయంలో రక్తం ఎంతో అవసరం ఉంటుందని ఆయన అన్నారు. రక్తదానం ద్వారా ఒకరి ప్రాణాన్ని మాత్రమే కాదు, ఒక కుటుంబాన్ని కూడా కాపాడగలమని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరు మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని, దీని ద్వారా సమాజానికి సేవ చేయడమే కాకుండా ఆరోగ్యవంతులు గా కూడా ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి



**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** కోరుకొండ మండలంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను ఆర్యవైశ్య మండల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం కోరుకొండ ఆర్టిసి కాంప్లెక్స్ వద్ద ఉన్న స్వర్గీయ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి, ఆర్యవైశ్యులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడుతూ ప్రత్యేక రాష్ట్రా ఏర్పాటుకు సుమారు 58రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కాపవరం ఆర్యవైశ్య అధ్యక్షులు ఓలేటి రాధాకృష్ణజీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్స్ పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బొండాడ మధు, స్వామి శ్రీనివాసు, ఓలేటి సూర్యనారాయణమూర్తి, కప్పలస్వామి, వాకచర్ల రామకృష్ణ, కటకం పెరుమాళ్ళు, చొప్పెర్ల శ్రీను, ఓలేటి రాధాకృష్ణజీ, ఓబిలిశెట్టి సాయి, ఓలేటి సుమంత్, చక్కా నరసింహారావు, మండవిల్లి వెంకట నాగరాజు, పాబోలు బాలయ్య గారు తదితరులు పాల్గొన్నారు.

## వేదులమ్మ జాతరకు లక్ష విరాళం ప్రకటించిన సిపిఐ ఎంఎల్ పార్టీ పలివెల వీరబాబు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలంలో చినకొండేపూడి గ్రామంలో మే 18 నుండి 31 వరకు నిర్వహించబడుచున్న శ్రీశ్రీశ్రీ వేదులమ్మ అమ్మవారి జాతర మహోత్సవానికి సిపిఐ (ఎం ఎంఎల్) పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు ఒక లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు. జాతర ఏర్పాట్లకు ఈ సహాయం అందిస్తున్నట్లు పలివెల వీరబాబు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కమిటీ సభ్యులు, పోలీస్ వారు,గ్రామ పెద్దలు సహకరించాలని కోరుతున్నానని ఆయన అన్నారు. రాజానగరం నియోజకవర్గ ప్రజలు, సిపిఐ ఎంఎల్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అధికారులు నాయకులు అందరూ ఆయురారోగ్యాలతోనూ,అష్టైశ్వర్యాలతోనూ అమ్మవారి వారి ఆశీస్సులు అందరిపై ఉండేలాగున అమ్మవారిని కోరుకున్నట్లుగా ఆయన తెలిపారు. శ్రీశ్రీశ్రీ వేదులమ్మ అమ్మవారని కోరిన కోరికలు తీరతాయనే నమ్మకం ఏళ్ల తరబడి అందరికీ ఉందని అన్నారు. అమ్మవారు చాలా శక్తిమంతమైన వారని పాడి పంటలను కాపాడుటకు అమ్మవారికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని స్థానిక ప్రజలకు ప్రగాఢ నమ్మకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, సిపిఐ ఎంఎల్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం, నిబద్ధత నేటి తరానికి ఆదర్శం



మండల పరిషత్ అధ్యక్షులు నౌడు వెంకటరమణ

**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని మండల పరిషత్ అధ్యక్షులు నౌడు వెంకటరమణ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో గల మండల పరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొలుత నాయకులు, అధికారులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నౌడు వెంకటరమణ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడని, తెలుగు రాష్ట్రం కోసం తన ప్రాణాలను త్యాగం చేసి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఆయన చూపిన త్యాగం, నిబద్ధత నేటి తరానికి ఆదర్శమని, ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని, సమాజ, దేశ కోసం పనిచేసే తత్వం ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయవరం గ్రామ తెదేపా నాయకులు ఉండవల్లి రాంబాబు, లొల్ల గ్రామ సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, ఎంపీడీఓ ఎం. శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీఓ వి.వి.ఆర్.కె. రాజు, హౌసింగ్ ఏఈ దాస్, వెలుగు ఏపీఎం నాగేశ్వరావు, ఎంఈఓ వై. సూర్యనారాయణ, ఏపీవో సుధారాణి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 2వ డివిజన్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి పర్యటన



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్థానిక 2వ డివిజన్లో పర్యటించారు. ఈ సందర్భంగా నారాయణ పురం ఆర్టీవో కార్యాలయం ఎదురుగా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అలాగే 2వ డివిజన్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. కాగా ఆర్టీవో కార్యాలయం ఎదురుగా ఉన్న ఒక మద్యం దుకాణం పక్క రోడ్డులో నిత్యం వాహనాలు నిలిపివేయడం వల్ల అటుగా రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ దృష్టికి తీసుకురాగా ఆయన పోలీసులకు ఫోన్ చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని, నిత్యం ఆ ప్రాంతంలో రక్షక్ ఉంచాలని సూచించారు. నాయకులు, స్థానిక ప్రజలు, నగర పాలక సంస్థ అధికారులు ఆయన వెంట ఉన్నారు.


## రాయవరం మండలంలో ప్రారంభమైన పది పరీక్షలు

మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాలలో 669 మంది విద్యార్థులకు ఒకరు గైర్హాజరు

వివరాలను వెల్లడించిన మండల విద్యాశాఖ అధికారి సూర్యనారాయణ



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయవరం మండలంలో నిర్వహిస్తున్న ఎస్.ఎస్.సీ పబ్లిక్ పరీక్షలు సోమవారంఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా ప్రారంభించినట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. మండల విద్యాధికారి ఎంఈవో వై.సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం రాయవరం మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలలో మొత్తం 669 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 668 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, ఒక విద్యార్థి గైర్హాజరయ్యారని వివరించారు. మండలంలోని రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సాయితేజ విద్య నికేతన్. రాయవరం, పసలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారన్నారు. అధికారులు పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారని. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహణ నిమిత్తం ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి చేశారని ఎంఈవో సూర్యనారాయణ పేర్కొన్నారు.



# కోనసీమ రైల్వే అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

## ఎంపీ జి.ఎం. హరీష్ బాలయోగి



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

లోక్‌సభలో రైల్వే డిమాండ్లపై జరిగిన చర్చలో అమలాపురం ఎంపీ జి.ఎం. హరీష్ బాలయోగి కోనసీమ రైల్వే అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జరిగిన చర్చలో కోటిపల్లి నర్సాపురం రైల్వే లైన్ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. 2026 27 సంవత్సరానికి రైల్వే మంత్రిత్వ శాఖకు సంబంధించిన గ్రాంట్లపై జరిగిన చర్చ సందర్భంగా ఎంపీ హరీష్ మాట్లాడుతూ, రైల్వే కనెక్టివిటీ బలోపేతం దేశ ఆర్థిక వృద్ధికి, ప్రాంతీయ అభివృద్ధికి ఎంతో ముఖ్యమని అన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కోటిపల్లి నర్సాపురం రైల్వే లైన్ ప్రాజెక్ట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఈ ఏడాది రైల్వే బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన రూ.10,134 కోట్లను ఆయన స్వాగతించారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి కొనసాగాలంటే మెరుగైన రైల్వే కనెక్టివిటీ అవసరమని తెలిపారు. విశాఖపట్నం, కృష్ణపట్నం, గంగవరం, కాకినాడ వంటి ప్రధాన పోర్టులు, విస్తారమైన తీరరేఖ కలిగిన ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తులో ప్రధాన లాజిస్టిక్స్, ఎగుమతుల కేంద్రంగా ఎదగడానికి గొప్ప అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పోర్టులు, పారిశ్రామిక ప్రాంతాలు, అంతర్గత జిల్లాల మధ్య రైల్వే సరుకు రవాణా కనెక్టివిటీ బలోపేతం చేయడం వల్ల వాణిజ్యం మరియు ఆర్థిక కార్యకలాపాలు గణనీయంగా పెరుగుతాయని ఆయన అన్నారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ ప్రాధాన్యతను వివరించిన ఎంపీ హరీష్, ఆంధ్రప్రదేశ్‌లో ఆమోదం పొందిన పలు రైల్వే ప్రాజెక్టులు ఇప్పటికీ పూర్తి కాలేదని తెలిపారు. విజయవాడ గూడూరు, భద్రాచలం, కొవ్వూరు, కర్నూలు, నంద్యాల, గుంతకల్,గుంటూరు వంటి మార్గాలు పూర్తి అయితే రాష్ట్రంలో కనెక్టివిటీ లోటు తగ్గుతుందని చెప్పారు. ప్రత్యేకంగా కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ గురించి మాట్లాడుతూ, ఇది కోనసీమ ప్రాంత ప్రజల దీర్ఘకాల ఆకాంక్ష అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే వ్యవసాయ ఉత్పత్తులు, చేపల ఉత్పత్తులు, పర్యాటకం మరియు స్థానిక పరిశ్రమలకు మెరుగైన రవాణా సౌకర్యం లభిస్తుందని తెలిపారు. అలాగే కోనసీమ ప్రాంతం దేశవ్యాప్తంగా ఉన్న మార్కెట్లతో మరింత సమర్థవంతంగా అనుసంధానమవుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయడానికి కట్టుదిట్టమైన పర్యవేక్షణ వ్యవస్థలు అమలు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో రైల్వే స్టేషన్ల ఆధునీకీకరణను మరింత విస్తరించాలని సూచించారు. ఇటీవలి కాలంలో స్టేషన్ పునర్నిర్మాణ ప్రాజెక్టులు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే కాకుండా ఆర్థిక కార్యకలాపాలను కూడా పెంచుతున్నాయని తెలిపారు. చివరగా భారతీయ రైల్వేలు దేశ సమగ్రతకు, ఆర్థికాభివృద్ధికి ఎప్పటినుంచో శక్తివంతమైన వేదికగా నిలుస్తున్నాయని ఎంపీ హరీష్ బాలయోగి అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం మరియు లాస్ట్ మైల్ కనెక్టివిటీని బలోపేతం చేయడం ద్వారా రైల్వే అభివృద్ధి ఫలితాలు ఆంధ్రప్రదేశ్ వంటి తీరప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పూర్తిగా అందుతాయని ఆయన పేర్కొన్నారు.

### నూకాంబిక అమ్మవారి జాతరకు

# పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలి

**ఆలమూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించిన జిల్లా ఎస్పీ రాహుల్ మీనా**




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రాహుల్ మీనా ఆలమూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పనితీరును సమీక్షిస్తూ పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం చింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. జాతరకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యూలైన్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, భక్తుల రాకపోకలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ పర్యవేక్షణలో ఆలమూరు ఎస్ఐ జి నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు మరియు అధికారులు సమన్వయంతో పనిచేసి జాతర నిర్వహణ సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పోలీసు శాఖకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ కార్యక్రమం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా కొత్తపేట నియోజకవర్గం శాసన సభ్యులు బండారు సత్యానందరావు ఆదేశాలు ప్రకారం అన్నదాతసుఖీభవ కార్యక్రమంలో భాగంగా కొత్తపేట గ్రామంలో కంఠంశెట్టి శ్రీనివారావు ఆధ్వర్యంలో రైతుల ఇంటికి వెళ్ళి వారిని కలిసి అన్నదాత సుఖీభవ 3వ విడత నిధులు 6000/- జమ అయినవి అడిగి తెలుసుకోవడం జరిగింది. అలాగే రైతులు అందరూ కూడా కోతకు వచ్చిన వరి పొలాలను కోసి రైతు సేవ కేంద్రాల. రైతులు ధాన్యం అమ్మిన 48 గంటలు లోపే వారి అకౌంట్‌కి రాష్ట్ర ప్రభుత్వం నగదు జమ చేయడం జరుగుతుంది. మన మంచి ప్రభుత్వాని కి అన్నదాతలు అందరూ తోడ్పాటును ఇవ్వాలని కోరుచున్నాము అని అన్నారు ఈ కార్యక్రమంలో జనసేన మండల ప్రెసిడెంట్ కంఠం చెట్టి సత్యప్రసాద్. తెలుగుదేశం మండలం రైతు ప్రెసిడెంట్, చోడ పీనేడు భాస్కరరావు. అలాగే చిన్న గోడ పాలు రైతు సేవ సిబ్బంది, మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కేదార్లంక గ్రామం గోదావరి నది అత్యంత ప్రమాదకరంగా మారనుంది



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి నది ఒడ్డున పొంచి వున్న పెను ప్రమాదం ప్రకృతి అందాలకు నిలయంగా ప్రఖ్యాత ప్రసిద్ధిగాంచిన ధనమ్మ తల్లి అమ్మవారి ఆలయం, సినిమా షూటింగ్ అనుకూల ప్రదేశంగా ఎంతో మంది పర్యాటకులు వచ్చే కేదార్లంక గ్రామం గోదావరి నది ఇప్పుడు చాలా అత్యంత ప్రమాదకరంగా మారింది అక్రమ రాయుళ్ళు ప్రతి రోజు అర్ధరాత్రి సమయాల్లో గోదావరి నది ఒడ్డునే చెట్టు లోతు గుంతలను అక్రమంగా తవ్వేసి గుంతలను అలానే వదిలేస్తున్నారు ఇలాంటి తవ్వకాల వల్ల నీరు ఉన్న సమయంలో అవగాహనా లేని పర్యాటకులు మృత్యువాత పడిన విషయం తెలిసిందే కానీ దారుణాతి దారుణంగా ఒడ్డు పక్కనే ఇలాంటి అక్రమ పనులు చేస్తున్న సంబంధిత అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నది వడ్డున ఈ అక్రమ తవ్వకాలు నిలుపుదల చేయకపోతే రానున్న రోజుల్లో కేదార్లంక గ్రామం మొత్తం ప్రమాదం బారినపడే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. ఈ విషయమై అధికారులు దృష్టి పెట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



# అమలాపురంలో కమర్షియల్ గ్యాస్ కొరతపై రెస్టారెంట్ యూనియన్ ఆందోళన

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

అమలాపురం పట్టణంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత తీవ్రంగా ఏర్పడుతున్న నేపథ్యంలో రెస్టారెంట్లు, భోజన హోటళ్లు, మెస్‌ల నిర్వహణ కష్టసాధ్యంగా మారుతోందని అమలాపురం రెస్టారెంట్ యూనియన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని కోరుతూ అమలాపురం రెస్టారెంట్ యూనియన్ అధ్యక్షుడు నల్లా పవన్ కుమార్ ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ నిశాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నల్లా పవన్ కుమార్ మాట్లాడుతూ, గ్యాస్ కొరత కారణంగా అమలాపురం పట్టణంలో ఉన్న రెస్టారెంట్లు, భోజన హోటళ్లు, మెస్‌లకు కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. పై అధికారుల నుంచి గ్యాస్ ఏజెన్సీలపై ఒత్తిడి ఉండడంతో కమర్షియల్ గ్యాస్ పంపిణీ చేయొద్దని ఆదేశాలు ఉన్నాయని, అందువల్ల గ్యాస్ సిలిండర్ల సరఫరా పూర్తిగా నిలిపివేయబడుతోందని చెప్పారు. ఇలాంటి పరిస్థితి కొనసాగితే అమలాపురం పట్టణంలో అనేక రెస్టారెంట్లు, హోటళ్లు, మెస్‌లు మూసివేయాల్సిన పరిస్థితి తలెత్తుతుందని ఆయన హెచ్చరించారు. ఈ హోటళ్లపై ఆధారపడి వందలాది మంది కార్మికులు, సిబ్బంది తమ జీవనోపాధిని సాగిస్తున్నారని, హోటళ్లు మూతపడితే వారు రోడ్డున పడే ప్రమాదం ఉందని తెలిపారు. కేవలం కట్టెల పొయ్యిలపై హోటళ్లను నడపడం సాధ్యం కాదని, కమర్షియల్ గ్యాస్ సరఫరా పునరుద్ధరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. గ్యాస్ సరఫరా సాధ్యంకాకపోతే ప్రత్యామ్నాయ మార్గాలు చూపించే విధంగా చర్యలు తీసుకోవాలని కూడా విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా గ్యాస్ బ్లాక్ మార్కెట్‌ను కట్టడి చేయాలని అధికారులను కోరారు. అమలాపురం పట్టణానికి నిత్యం ఉద్యోగాలు, చదువులు, ఇతర అవసరాల నిమిత్తం వేలాది మంది ప్రజలు వచ్చి వెళుతుంటారని, ఇలాంటి పరిస్థితుల్లో హోటళ్లు, రెస్టారెంట్లు మూసివేస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని యూనియన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హోటల్స్ యూనియన్ సెక్రటరీ కోకా రాంబాబు, గణపతి హోటల్ బాలు, జీకే హోటల్ వంశీ, బొండం బాబాయ్ హోటల్ గణేష్, గ్రీన్ ట్రీ నాయుడు, దుర్గాస్ హోటల్ శంకర్ తదితర హోటల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

**జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం**



# అమలాపురం అభివృద్ధికి కొత్త వెలుగు

## వడ్డిగూడెంలో విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

అమలాపురం పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, రాబోయే మూడేళ్లలో అమలాపురాన్ని రాజమండ్రి, కాకినాడ నగరాలకు ధీటుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. పట్టణంలోని వడ్డిగూడెం ప్రాంతంలో నూతనంగా నిర్మించిన ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థకు చెందిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ అమలాపురం అభివృద్ధి కోసం గతంలో స్వర్గీయ మెట్ల సత్యనారాయణరావు వేసిన పునాదులను ఆదర్శంగా తీసుకుని తాను పనిచేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. శ్రీరాంపురం, సూర్యానగర్, వడ్డిగూడెం ప్రాంతాల విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సుమారు రూ.80 లక్షల విలువైన స్థలాన్ని కేటాయించి యుద్ధప్రాతిపదికన ఈ ఉపకేంద్రాన్ని నిర్మించినట్లు వివరించారు. నియోజకవర్గంలో మరిన్ని విద్యుత్ సౌకర్యాల కోసం రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి అవసరాలను వివరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అల్లవరం మండలం తూర్పులంకలో, అమలాపురం రూరల్ పరిధిలోని వంచింతలపూడిలో, ఉప్పలగుప్తం మండలంలోని ఎన్ కొత్తపల్లి ఎస్ యానాం గ్రామాల మధ్య మూడు కొత్త విద్యుత్ ఉపకేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు. మంత్రి దీనిపై సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. అదేవిధంగా పెరుగుతున్న విద్యుత్ లోడును దృష్టిలో ఉంచుకుని ఉప్పలగుప్తం మండలంలో 130 కేవీ భారీ విద్యుత్ ఉపకేంద్రాన్ని మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఇందుకోసం నాలుగు ఎకరాల స్థలాన్ని సేకరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీ సాక్షిగా ఐదేళ్లలో కరెంటు బిల్లులు పెంచబోమని ఇచ్చిన మాట భారతదేశ చరిత్రలోనే ఒక ప్రత్యేకమైన నిర్ణయమని ఎమ్మెల్యే ఆనందరావు పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఇప్పటికే రెండు బ్రిడ్జిలు పూర్తి చేసినట్లు తెలిపారు. త్వరలోనే కాలువలపై ఆరు కొత్త బ్రిడ్జిలకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా, ముంపు సమస్యలు తలెత్తకుండా ఆక్రమణల తొలగింపుకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పదో తరగతి పబ్లిక్ పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో కీలకమైనవని, వాటిని పారదర్శకంగా మరియు పకడ్బందీగా నిర్వహించాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. కొత్తపేటలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను సందర్శించిన ఆయన, పరీక్షల నిర్వహణ తీరును మరియు పరీక్షా కేంద్రాల్లో చేసిన ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మరియు అధికారులను ఉద్దేశించి మాట్లాడిన కలెక్టర్, పరీక్షల పట్ల అనవసర భయం వద్దని, ఆత్మవిశ్వాసంతో సమాధానాలు రాయాలని సూచించారు. పరీక్షా పత్రం అందిన వెంటనే తొందరపడకుండా, మొదటి 15 నిమిషాల పాటు ప్రశ్నాపత్రాన్ని పూర్తిగా చదవాలని సూచించారు. సరైన ఆహారం తీసుకోవడం తగినంత నిద్రపోవడం ద్వారా ఏకాగ్రత పెరుగుతుందని గుర్తుచేశారు. పరీక్షా నియమాలను వివరించిన ఆయన, నిర్ణీత సమయం కంటే ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. విద్యార్థులు హాల్ టికెట్ మరియు అవసరమైన స్టేషనరీతో పాటు రావాలని, మొబైల్ ఫోన్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాలకు తీసుకురావద్దని సూచించారు.వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గదిలో సరిపడా వెలుతురు, ఫ్యాన్లు, స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉంచాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల కోసం ప్రాథమిక చికిత్స(ఫస్ట్ ఎయిడ్) కిట్‌లు సిద్ధంగా ఉంచాలని సూచించారు.పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమల్లో ఉంటుందని, అలాగే సీసీటీవీ కెమెరాల నిఘా నిరంతరం ఉంటుందని తెలిపారు. పరీక్షలు సజావుగా సాగేందుకు రెవెన్యూ మరియు విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కష్టపడి చదివిన విద్యార్థులకు తగిన ఫలితం లభిస్తుందని వారు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ రాంబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి మరియు ఇతర విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

### దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని

# ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** శెట్టిబలిజ జాతిపిత కీర్తిశేషులు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కొత్తపేట యువ శెట్టిబలిజ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కొత్తపేట ఆర్ఎస్ బీసీ కన్వెన్షన్ హాల్‌లో యువ శెట్టిబలిజ సంఘం ఆత్మీయ సమావేశం సంఘ అధ్యక్షుడు శీలం కొండబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన జరగనున్న దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరిన కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబుకి,పొలిట్‌బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం కి, పితాని సత్యనారాయణకి సమావేశంలో పాల్గొన్న నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు శీలం కొండబాబు, సంఘ గౌరవ అధ్యక్షులు యనమదల శ్రీనివాస్, బొక్కా ప్రసాద్, గౌరవ సలహాదారులు ముషిని వెంకట రమణ, ఉపాధ్యక్షుడు జోగి మురళీ, సెక్రెటరీ రాయుడు కార్తీక్, కొత్తపేట బీసీ చైతన్య వేదిక అధ్యక్షుడు కడలి పార్ధ సారధి.కొత్తపేట మండల టీడీపీ పార్టీ సెక్రెటరీ కడలి బీమా, మామిడి శెట్టి బాలాజీ, కముజు తాతాజీ రాయుడు బాబీ,జోగి గని రాజు, కొప్పిశెట్టి శ్రీరామ్, కుడుపూడి నాగు, జె.శేఖర్. తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేట విద్యా బాలా మందిర్‌లో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కొత్తపేట విద్యా బాల మందిర్ హైస్కూలులో పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కరస్పాండెంట్ రామోజు అనురాధ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కొరకు ప్రాణత్యాగం చేసి అమరజీవి అయిన మహాపురుషుడు. మద్రాసులో తెలుగు వారికి జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక తెలుగు మాట్లాడే వారందరికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఏభై ఎనిమిది రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి డిసెంబర్ పదిహేను నా1952 లో అమరుడు అయ్యాడు. అయన మరణాంతరం అక్టోబర్ 1 తేదీ కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది భాషాప్రయుక్త రాష్ట్రాలలో భాగంగా నవంబర్ 1 తేదీ హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పడింది. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు నూకపేయి శివరత్నం ఉపాధ్యాయులు సుధాకర్, శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొని ఆయనకు నివాళులర్పించారు.

# శిల్పశాలను సందర్శించిన ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేటలో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కు ఘన సత్కారం శాసనసభ్యుడు బండారు సత్యానందరావు ఆదేశం మేరకు తెలుగు భాషకు ఎంతో ప్రాచుర్యం కల్పించిన అవనిగడ్డ శాసనసభ్యులు డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ కు కొత్తపేటలో ఘన సత్కారం లభించింది రాజమహేంద్రవరం లోని బొమ్మూరులో గల పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో పొట్టి శ్రీరాముల విగ్రహాన్ని ఆవిష్కరించారు విగ్రహాశిల్పి రాజకుమార్ ఉడయార్ కోరిక మేరకు శిల్పశాలను సందర్శించేందుకు కొత్తపేట విచ్చేశారు ఆ మేరకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు టిడిపి శ్రేణులు శిల్పశాలకు వచ్చి ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఏఎంసి వైస్ చైర్మన్ కంఠం శెట్టి శ్రీనివాసరావు గ్రామ సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు ఉప సర్పంచ్ విల్ల మారుతి ప్రసాద్ రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మిద్దె ఆదినారాయణ టిడిపి నాయకులు చోడపనీడి భాస్కరరావు ముద్రగడ సుబ్బారావు శీలం సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్య, వైద్యం, రోడ్లకు ప్రాధాన్యం

**యండగండిలో రూ.58.70 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం**

**మంత్రి సుభాష్ చొరవతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు**



**కె.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల కనీస అవసరాలైన విద్య, వైద్యం, రోడ్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అలుపెరగని కృషి చేస్తున్నారని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం యండగండి గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. గ్రామంలో రూ.36 లక్షల వ్యయంతో నిర్మించనున్న హెల్త్ క్లినిక్‌కు శంకుస్థాపన చేశారు. అలాగే అదే గ్రామంలో రూ.22.70 లక్షల వ్యయంతో నిర్మించిన ఐదు ఇంటర్నల్ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం గ్రామ స్థాయిలో ఆరోగ్య సదుపాయాలను విస్తరిస్తోందన్నారు. అలాగే గ్రామాల్లో రహదారులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సోమవారం ఒక్కరోజే రూ.58.70 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, పామర్రు పి హెచ్ సి వైద్యులు డాక్టర్ హర్షిత పోలిశెట్టి, డాక్టర్ పి. విష్ణువర్ధన్, చౌదరి, కూటమి పార్టీ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రైతన్న మీకోసం వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా వాసంశెట్టి సత్యం పలువురు రైతులను నేరుగా కలిసి పంచ సూత్రాలపై అవగాహన కల్పించారు.

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com

# పులి సంచారంపై హనుమాన్ బృందాల నిరంతర పర్యవేక్షణ...!

**శంఖవరం మండలంలో 28 గంటల పులి సంచారం ఇదీ - పులి కట్టడికి 11 హనుమాన్ బృందాల తీవ్ర కృషి - మండపం నుంచి గొంధి కొత్తపల్లికి పులి యు టర్న్**







**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలో ఆదివారం 15 వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి సోమవారం 16 వ తేదీ సాయంత్రం 4 గంటల వరకూ పులి సంచారం పరిస్థితిపై తాజా సమాచారాన్ని కాకినాడ జిల్లా అటవి శాఖ అధికారికంగా సోమవారం సాయంత్రం విడుదల చేసింది. ఆదివారం 15 తేదీ మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో మండల కేంద్రం శంఖవరంలోని మండల రెవెన్యూ కార్యాలయం వెనుక ఉన్న ఊర కొండపై నుండి ట్రాంక్విలైజేషన్ బృందాలు లక్ష్యంగా పెట్టుకున్న ప్రాంతాన్ని తప్పించుకొని కిందకు దిగి వచ్చిన పులి కత్తిపూడి - కోటనందూరు రహదారిని దాటి అన్నవరం సమీపంలోని పంపా రిజర్వాయర్ వైపు ఉన్న సర్వే తోటలు వ్యవసాయ పొలాల్లోకి వెళ్లింది. కార్యక్షేత్రంలో సిద్దంగా ఉన్న డ్రోన్ బృందాలు అప్రమత్తమై శంఖవరం మండలం మండపం, తాళ్ళపాలెం గ్రామ పరిసర ప్రాంతాల్లోని పులి సంచారం, కదలికలను గుర్తించి చిత్రీకరించి పులి ఆచూకీని నిర్ధారించాయి. వెంటనే అటవీ, రెవెన్యూ, పోలీస్ శాఖలు సమీప గ్రామాలను అప్రమత్తం చేశాయి. ప్రజల భద్రత దృష్ట్యా, వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈవిధంగా పులికి విద్యుత్ఘాతం ప్రమాదం జరగకుండానూ, అలాగే రైతులు తమ పొలాల్లోకి వెళ్లకుండానూ నివారించ గలిగారు. దీంతో మండపంలో ప్రభుత్వ అధికార యంత్రాంగం నిర్బంధం, నిషేధం వలన రైతులు పొలాల్లోనికి వెళ్లి తమ పశువులను గ్రామం లోనికి తోలుకు తెచ్చుకుని సంరక్షించుకునే అవకాశాన్ని కోల్పోయారు. ఫలితంగా శనివారం రాత్రి ఒకానొక సమయంలో పొలాల్లో ఉన్న పోలం బూరయ్యకు చెందిన గేదె దూడను పులి పొట్టన పెట్టుకుంది. జిల్లా పశు సంవర్ధక శాఖ ఇంఛార్జి సంయుక్త సంచాలకులు డాక్టర్ వడ్డి శ్రీధర్, కత్తిపూడి ప్రభుత్వ పశువైద్యశాల వైద్యులు కాకర్ల ప్రసాద్ మిగతా సిబ్బంది సోమవారం ఉదయం 11 గంటలకు గేదె దూడ కళేబరాన్ని పరిశీలించి మరణాన్ని నమోదు చేశారు. పశువులను పొలాల్లోని పశువుల మకాముల్లో వదలకుండా ఇళ్ల వద్దనే కట్టుకునే విధంగా రైతులకు తగు సూచనలు ఇచ్చారు.

**మండపం నుంచి గొంధి కొత్తపల్లికి పులి యు టర్న్ ...**

సోమవారం 16 తేది తెల్లవారు జామున మండపం నుంచి పులి మళ్లీ గొంధి కొత్తపల్లి, మాసంపల్లి గ్రామాల సమీపం లోనికి తిరిగి వచ్చింది. నల్లగొండమ్మ తల్లి గుడి కొండ ప్రాంతం వైపు వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. వెంటనే హనుమాన్ బృందాలు ఆ ప్రాంతానికి చేరుకుని సమీప గ్రామాలను మళ్లీ అప్రమత్తం చేశాయి. గొంధి కొత్తపల్లి - గౌరంపేట గ్రామాల రాదారిని తాత్కాలికంగా మూసివేశారు. విద్యుత్తు సరఫరాను కూడా తాత్కాలిక నిలిపి వేశారు. కాకినాడ జిల్లా అటవీశాఖ అధికారి ఎన్.రామచంద్రరావు ప్రత్యక్ష నేతృత్వంలో పులి కదలికలను పరిస్థితిని హనుమాన్ బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉన్నాయి. ప్రజల భద్రత, పులి సంరక్షణ కోసం అవసరమైన అన్ని చర్యలనూ ఎప్పటి కప్పుడు తీసుకుంటున్నారు.

**పులి కట్టడికి 11 హనుమాన్ బృందాల తీవ్ర కృషి ...**

పులి సంచార పరిసరాల్లో క్షేత్ర స్థాయిలో 3 ట్రాంక్విలైజింగ్ బృందాలు, 2 డ్రోన్ బృందాలు, వెరీ హై ఫ్రీక్వెన్సీ సిగ్నల్ స్వీకరణ బృందం 1, విశాఖపట్నం జంతు ప్రదర్శన శాల నుండి 1 వన్యప్రాణి అంబులెన్స్, రాజమహేంద్రవరం, ఏలేశ్వరం, కాకినాడ నుండి 4 రాపిడ్ రెస్పాన్స్ రెస్క్యూ బృందాలు కలిపి మొత్తం 11 హనుమాన్ బృందాలు రేయింబవళ్లు పులిని సురక్షితంగా బందించేందుకు తీవ్ర కృషి చేస్తున్నాయి. అన్ని బృందాలు మోహరించి ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా, అలాగే పులి రక్షణకు అవసరమైన చర్యలను తీసుకుంటూ ఉమ్మడి పర్యవేక్షణను యధాశక్తి కొనసాగించాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ముఖ్య అటవీ సంరక్షకులు, అటవీ దళాధిపతి పి.వి.చలపతి రావు, రాజమండ్రి ముఖ్య అటవీ సంరక్షకులు శ్రీకాంతనాథ రెడ్డి తదితరులు పులి రక్షణ చర్యలను పర్యవేక్షించేందుకు సోమవారం సాయంత్రం 5 గంటలకు శంఖవరం మండలం, మసంపల్లి గ్రామాన్ని సందర్శించారు.

# మత సామరస్యానికి ప్రతీక రంజాన్

**డిబిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిమా అక్తర్ ఆధ్వర్యంలో రంజాన్ ఇఫ్తార్ విందు**



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** మత సామరస్యానికి ప్రతీక రంజన్ పండుగని దళిత బహుజన ఫ్రంట్ నేషనల్ కో ఆర్డినేటర్ టి.చంగల్ రావు అన్నారు. కాకినాడ సన్ రైస్ రెస్టారెంట్ లో దళిత బహుజన ఫ్రంట్ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిమా అక్తర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రంజాన్ ఇఫ్తార్ విందు కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దళిత బహుజన ఫ్రంట్ నేషనల్ కో ఆర్డినేటర్ టి.చంగల్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ, శాంతి, సహనం, సోదరభావానికి ప్రతీకగా రంజాన్ మాసం నిలుస్తుందన్నారు. గత 20సంవత్సరాలుగా రంజాన్ ఆచరిస్తున్న దూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుకుంటున్న స్టూడెంట్స్ ఉపవాసంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా మహిళా సభ్యురాలు సలిమా అక్తర్ పేర్కొన్నారు. అనంతరం రోజు ఆహారాన్ని సిద్ధం చేసిన మేడిశెట్టి శ్రీను అభినందించారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూకే, శ్యామ్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి జాతరకు తరలిరావాలని పగడాల పేట గ్రామ పెద్దల పిలుపు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామం పగడాలపేటలో కొలువైన గ్రామ దేవత శ్రీ నూకాలమ్మ తల్లి జాతర మహోత్సవాలకు రంగం సిద్ధమైంది. పురాతన కాలం నుండి భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి గాంచిన అమ్మవారి ఉత్సవాలను ఈ ఏడాది అత్యంత ఘనంగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు, భక్తజనులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ వేడుకల్లో భాగంగా ఈ నెల 17వ తేదీన భక్తిశ్రద్ధలతో జాగారం కార్యక్రమం, మరుసటి రోజు అనగా 18వ తేదీన అత్యంత వైభవంగా సంబరం నిర్వహించనున్నారు. ఈ రెండు రోజుల పాటు పగడాలపేట పరిసర ప్రాంతాలన్నీ ఆధ్యాత్మిక చైతన్యంతో పులకించనున్నాయి. జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, తమ మొక్కులు చెల్లించుకోవాలని, అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని గ్రామ పెద్దలు భక్తులకు సాదరంగా విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఆలయ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఈ ఆధ్యాత్మిక వేడుకల ప్రారంభ సూచికగా కూటమి నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే పంతం నానాజీ కుటుంబంతో సహా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వారు ఈ సందర్భంగా ప్రార్థించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ జాతర మహోత్సవం కేవలం ఒక ధార్మిక కార్యక్రమమే కాకుండా, గ్రామస్తులందరినీ ఏకతాటిపైకి తెచ్చే ఒక గొప్ప వేడుకగా నిలవనుంది.

# గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ప్రారంభం



**అన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరంలో 32 విడత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ప్రారంభం సోమవారం ప్రారంభం అయ్యింది. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా శంఖవరం, రౌతులపూడి మండలాల పశు సంవర్ధకశాఖ - శంఖవరంలోని ప్రభుత్వం ఏరియా పశువుల ఆస్పత్రి ఆధ్వర్యంలో అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం గోశాలలో ఉన్న పశువులకు సోమవారం ఉదయం 7.30 గంటలకు జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ శ్రీధర్ టీకాలను వేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ గాలి కుంటు వ్యాధి నివారణా టీకాల కార్యక్రమాన్ని నేటి నుండి వచ్చే నెల ఏప్రిల్ 15 వ తారీకు వరకూ నెల రోజుల పాటు మండల వ్యాప్తంగా నిర్వహిస్తారు. ఈ ఉచిత టీకాల ప్రారంభ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రైతులను ఉద్దేశించి సంయుక్త సంచాలకులు డాక్టర్ శ్రీధర్ మాట్లాడారు. ప్రతి పాడి పశువుకూ నాలుగు నెలలు నిండిన దూడ దగ్గర నుంచి అన్ని వయసుల్లో ఉన్న పశువులకూ ఈ టీకాలను ప్రభుత్వం ఉచితంగా వేస్తున్నదని వెల్లడించారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం అనంతరం శంఖవరం మండలంలో పులి సంచరిస్తున్న ప్రదేశాలను, అలాగే మండపం గ్రామంలో పులి బారిన పడి మరణించిన పశువును పరిశీలించి, పశువులను పొలాల్లోని పశువుల మకాముల్లో వదలకుండా ఇళ్ల వద్దనే కట్టుకునే విధంగా సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శంఖవరం, రౌతులపూడి మండలాల పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పీతల మనోజ్ కుమార్, కత్తిపూడి ప్రభుత్వ పశువుల ఆస్పత్రి వైద్యులు కాకర్ల ప్రసాద్, మిగతా సిబ్బంది పాల్గొన్నారు.

# చావు దెబ్బ తింటున్న పేదల గూడు

**కలెక్టర్‌కు మొరపెట్టుకున్న పిల్లి సత్యనారాయణ మూర్తి**



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం చీడిగ గ్రామంలో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న నిరుపేదలపై ఒక్కసారిగా ముంచుకొచ్చిన తొలగింపు నోటీసుల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గత 35-40 ఏళ్లుగా డ్రెయిన్ పక్కన సిమెంట్ రోడ్డు నిర్మించుకుని, ప్రభుత్వ పట్టాలతో పక్కా గృహాలు నిర్మించుకున్న 23 కుటుంబాలకు డ్రైనేజీ విభాగం నుంచి వచ్చిన నోటీసులు వారిని ఆందోళనలోకి నెట్టాయి. ఈ నేపథ్యంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి నేతృత్వంలో బాధితులు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. గతంలో పిల్లి అనంతలక్ష్మి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో, అప్పటి కలెక్టర్ అరుణ్ కుమార్ దృష్టికి ఈ నిరుపేదల సమస్యను తీసుకెళ్లి, అన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీరికి 23 పట్టాలను మంజూరు చేయించడం జరిగింది. ఈ ఇళ్లకు విద్యుత్ సౌకర్యం, ఇంటి పన్ను వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ఇన్నేళ్లుగా సాఫీగా సాగుతున్న వీరి జీవితాల్లోకి ఇప్పుడు నోటీసులు రావడం అర్థరహితమని సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. ముఖ్యంగా ఇది కాకినాడ ఉప్పుటేరుకు కలిసే ఒక డెడ్ ఎండ్ డ్రెయిన్ అని, దీనివల్ల ఎవరికీ ఎలాంటి ఆటంకం లేదని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో, ముఖ్యంగా ఎస్.ఆర్ నగర్ వంటి చోట్ల డ్రెయిన్లపై మూడంతస్తుల మేడలు నిర్మించిన వారిని వదిలేసి, కేవలం ఈ 23 మంది పేదలపైనే అధికారులు ఎందుకు ప్రతాపం చూపిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. కొవ్వూరు నుంచి అరట్లకట్ట వెళ్లే మెయిన్ రోడ్డు వెంబడి గోదావరి కాలువ గట్టుపై ఉన్న ఆక్రమణల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నాయని, అక్కడ చర్యలు తీసుకోవడం కోసం నోటీసులు ఇచ్చారన్నారు. కానీ ఎవరికీ ఇబ్బంది లేని చీడిగ గ్రామంలోని పేదలను టార్గెట్ చేయడం అన్యాయమని అన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి, సంబంధిత విభాగంతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని, బాధితులకు అండగా పోరాటం కొనసాగిస్తామని పిల్లి సత్యనారాయణమూర్తి ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

# తెలుగు రాష్ట్ర సాధనకు ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు

**మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ**



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం సాధించేందుకు తన ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా కాకినాడ రూరల్ మండలం వాకలపూడి మహాలక్ష్మి నగర్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం "పిల్లి" దంపతులు మాట్లాడుతూ..తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం రావాలని డిమాండ్ చేస్తూ ఆయన చేపట్టిన నిరాహార దీక్ష దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని నాయకులు గుర్తుచేశారు. 1952లో ప్రారంభించిన ఆమరణ నిరాహార దీక్షను 58 రోజుల పాటు కొనసాగించి చివరికి తన ప్రాణాలను అర్పించిన ఆయన త్యాగం ఫలితంగానే 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. అమరజీవి త్యాగం తెలుగు జాతికి గర్వకారణమని, ఆయన చూపిన త్యాగస్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అమరావతిలోని శాఖమూరు పార్కు వద్ద 'స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైజ్' పేరుతో 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన 125వ జయంతిని పురస్కరించుకుని ఆ విగ్రహాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. రూ.150 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా 6.8 ఎకరాల విస్తీర్ణంలో స్మృతివనాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం


**జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్**

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**



ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను పణంగా పెట్టి 58 రోజుల పాటు కఠిన నిరాహార దీక్ష చేసి ఆత్మబలిదానం చేసిన మహోన్నత వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసంగిస్తూ అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా జిల్లా ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు మాట్లాడే వారందరికీ ప్రత్యేక గుర్తింపు, రాష్ట్రాన్ని అందించిన ఆయన త్యాగం అజరామరమని అన్నారు. గాంధేయవాదిగా ఆయన చూపిన పట్టుదల, సత్యం-అహింస మార్గాలు నేటి తరానికి ఆదర్శంగా, స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. మాతృభాష ప్రాముఖ్యతను చాటిచెప్పిన ఆయన స్ఫూర్తితో తెలుగు భాషా వికాసానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పదవుల కోసం కాకుండా నిస్వార్థ సేవతో జాతి ప్రయోజనాల కోసం ప్రాణత్యాగం చేసిన ఆయన సేవా భావాన్ని మన కార్యాలయాల్లో, విధుల్లో అలవర్చుకోవాలని సూచించారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని కోరారు. అమరజీవికి మనం ఇచ్చే నిజమైన నివాళి ఆయన చూపిన బాటలో నడవడమేనని అన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడిగా అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని కలెక్టర్ పేర్కొన్నారు. సమాజ న్యాయం, సమానత్వం, ప్రజల హక్కుల కోసం ఆయన చూపిన త్యాగస్ఫూర్తి ప్రతి భారతీయుడికి ఆదర్శప్రాయంగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ టి.నిశాంతి, తహసీల్దార్ దివాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# జూలైలో మూతబడిన ఆలయం ఎట్టకేలకు పునఃప్రారంభం





**దేవీపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** కోరిన కోర్కెలు తీర్చే దేవతగా ఆ ప్రాంతంలో మాతృశ్రీ గండి పోశమ్మ అమ్మవారికి ఎనలేని పేరు. నిత్యం భక్తులతో పూజలు అందుకోవాల్సిన ఆమెకు పోలవరం ప్రాజెక్ట్ కాఫర్ డ్యాం నిర్మాణం జరిగిన నాటి నుండి ఏడాదిలో ఆరు నెలలు మాత్రమే పూజలు అందుకొంటుంది. ఈ ఏడాది మాత్రం మరో రెండు నెలలు అమ్మవారి ఆలయం పూర్తిగా గోదావరి నది గర్భంలో ఉండిపోవడం తో జూలై రెండవ వారంలో మూతపడిన ఆలయాన్ని సోమవారం ఆలయ పండితులు, ధర్మకర్తలు, గ్రామస్థుల మధ్య ఆలయ సంప్రోక్షణ అనంతరం అమ్మవారి దర్శనాలను ఆలయాన్ని అధికారులు పునఃప్రారంభించారు. సుదీర్ఘ విరామం తర్వాత తమ గ్రామ దేవతగా పూజించే గొందూరు గ్రామస్థులతో పాటు రాష్ట్ర నాలుమూలల నుండి వచ్చిన భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

# రైతుల ఉజ్వల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

**రైతు మోముల్లో చిరునవ్వే సర్కార్ లక్ష్యం - లాభదాయక వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాలి**

**రైతన్న మీకోసం సేవలో ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి**



**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రైతుల మోముల్లో చిరునవ్వే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వ్యవహరిస్తుందని రంప చోడవరం ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రంప చోడవరం మండలం తామరపల్లి గ్రామంలో సోమవారం రైతన్న మీకోసం - వారోత్సవాలు కార్యక్రమం వ్యవసాయ శాఖ అధికారి సౌజన్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమెకు కూటమి శ్రేణులు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె ప్రతీ ఇంటింటికీ వెళ్లి రైతుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల రైతులకు ప్రభుత్వం అందించిన అన్నదాత సుఖీభవ - పి. యం. కిసాన్ నిధులు అందరికీ అందట లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యాంక్ ఖాతాలో నగదు జమా కాకపోతే వెంటనే వ్యవసాయ శాఖ సిబ్బందిని, సచివాలయ ములో వెంటనే సంప్రదించాలని సూచించారు. ఇప్పటికే అందరికీ నగదు వేసినట్లు పేర్కొన్నారు. రైతులకు సాగునీటి యాజమాన్య పద్ధతులపై వివరించారు. 90 శాతం సబ్సిడీపై బిందు సేద్యానికి ప్రభుత్వం అందిస్తున్నా మన్నారు. రైతులు లాభదాయక వ్యవసాయ పద్ధతులు పై ఎప్పటికప్పుడు చైతన్యం చేయాల్సిన అవసరం వ్యవసాయ శాఖ పై ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం కొరకు 4116గ్రామ పంచాయతీల్లో 5.24 లక్షల హెక్టార్ లలో 11.29 లక్షల రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటిస్తున్నట్లు పేర్కొన్నారు.

**మంచి విద్యాబోధన అందించాలి**

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని రంపచోడవరం ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రంప చోడవరం మండలం తామరపల్లి గ్రామంలో గిరిజన సంక్షేమ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ లోతా లక్ష్మణరావు. నియోజక వర్గ ఎస్టీ విభాగం అధ్యక్షులు పండా చెల్లన్న దొర అనే బాబీ ప్రధాన కార్యదర్శి కోసు నాగన్న దొర, క్లస్టర్ ఇంచార్జి కారం సింహాచలం, సీతపల్లి దేవస్థానం చైర్మన్ కుంజం బాపన్న దొర, సభ్యులు సిద్దవెంకన్న దొర, బొగ్గుల లక్ష్మి, కొమరం నాగన్నదొర, ఈక నాగన్న దొర, తెల్లం భద్రం, బొగ్గుల లక్ష్మి, నర్సిరెడ్డి, కూర శ్రీరాములు, కారం శాంతి కుమారి, గణపతి, పీసా కమిటి ప్రతినిధులు కుంజం కొండయ్య దొర, కంగల వేమన్న దొర, మడకం వెంకన్న దొర, ఈక గోపి, శెట్టి చిన్నమ్మి, సోడే సోమన్నదొర, కుంజం సత్యనారాయణ దొర, కుంజం బాపనమ్మ, వార్డు సభ్యులు కుంజం లక్ష్మి, సోడే చిట్టిదొర, కన్నపుదొర, భద్రం దొర, మరియు ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధులు డి పి ఎం జిల్లా పథక నిర్వహణ అధికారి రాబిన్ సుదర్శన్,గజేంద్ర, నాగరాజు, శాంత కుమారి, సుధ, ప్రభుత్వ శాఖల సిబ్బంది అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శశి బిందు, రాబిన్ , అగ్రికల్చర్ అసిస్టెంట్ దూడ జేమ్స్, సత్య నారాయణ , పంచాయతీ కార్యదర్శి కామరాజు, వెటర్నరీ అసిస్టెంట్ కె.నాగబాబు,వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, రాజేంద్ర , హనుమంత రావు , ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా కలపను తరలిస్తే

# చర్యలు తప్పవు

**ఇందుకూరు రేంజ్ అధికారి కొండలరావు**



**దేవీపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** మండలంలోని చిన్నారిగండి గ్రామం నుండి ఆదివారం రాత్రి వెదురు కలపను తరలిస్తున్న బొలెరో వాహనం అలాగే ఏ విధమైన అనుమతి పత్రాలు లేకుండా వెదురు కలపను తరలిస్తున్న ట్రాక్టర్‌ను దేవారం, పురుషోత్తపట్నం ఫారెస్ట్ బీట్ అధికారులు నేలకోట గ్రామం సమీపంలో పట్టుకొని వాహనాలను రేంజ్ కర్యాలయానికి తరలించినట్టు రేంజ్ అధికారి కొండలరావు తెలియజేసారు. ఒకవైపు అటవీ ప్రాంతం నుండి కలపను తరలిస్తే చర్యలు తప్పవు అని అటవీ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నప్పటికీ వ్యాపారులు అధికారుల మాటలు పెడ చెవిన పెట్టినట్టే కనిపిస్తుంది. కలప వ్యాపారులు యధేచ్ఛగా అర్ధరాత్రి సమయంలో కలపను తరలిస్తున్నారు. గత వారం రోజులుగా అటవీ శాఖ అధికారులు అర్ధరాత్రి సమయంలో కలపను తరలిస్తున్న వాహనాలను పట్టుకొని కేసులు నమోదు చేశారు. అర్ధరాత్రి సమయంలో కలపను తరలిస్తున్న వాహనాలను పట్టుకున్న బీట్ అధికారులను రేంజ్ అధికారి అభినందించారు. కలప వ్యాపారులు అక్రమంగా కలప రవాణా చేస్తే చర్యలు తప్పవు అని మరొక సారి హెచ్చరించారు.

నూతన పోలవరం జిల్లాకు రెగ్యులర్

# అధికారులను తక్షణమే నియమించాలి

**ఏజెన్సీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక ప్రకటించాలి: సిపిఎం డిమాండ్**



**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** నూతనంగా ఏర్పాటు చేసిన పోలవరం జిల్లా కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి బాటలు వేయాలని సిపిఎం పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ డిమాండ్ చేశారు. జిల్లా ప్రకటించి నెలల రోజులు గడుస్తున్నా, నేటికీ పూర్తిస్థాయి పాలన పట్టాలెక్కకపోవడం గిరిజన ప్రజల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోందనీ ఆమె అన్నారు. నూతన జిల్లాకు ఇన్‌ఛార్జ్ పాలనతో పనులు జరగవని తక్షణమే జిల్లాకు రెగ్యులర్ కలెక్టర్, ఎస్పీ,ఇతర అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులను ప్రభుత్వం తక్షణమే నియమించాలనీ సీపీఎం పార్టీ ప్రాంతీయ కమిటీగా ఆమె డిమాండ్ చేశారు. పూర్తిస్థాయి యంత్రాంగం అందుబాటులో లేకపోవడం వల్ల సామాన్య ప్రజలు, ముఖ్యంగా గిరిజనులు తమ సమస్యల పరిష్కారం కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి వస్తుందనీ,పోలవరం జిల్లా మెజారిటీ భాగం ఏజెన్సీ (గిరిజన) ప్రాంతం కావడంతో ఇక్కడ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక వ్యూహంతో ముందుకు వెళ్లాలనీ ఆమె అన్నారు. మారుమూల గ్రామాల వరకు నాణ్యమైన రోడ్లు, రవాణా సౌకర్యాలు కల్పించాలనీ,ఆ గ్రామాలకు రోడ్ సౌకర్యం కల్పించాలని ప్రజలు రోజు అధికారుల చుట్టూ ఐటీడీఏ దగ్గరికి కాళ్ళు అరిగేలా తిరగాల్సిన పరిస్థితి వస్తుశీదని కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు రోడ్ నిర్మించాలని, ఆగిపోయిన రోడ్డు పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

**పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు:** ప్రాజెక్టు కారణంగా ఇళ్లు, భూములు కోల్పోయిన గిరిజనులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని పూర్తిస్థాయిలో అమలు చేయాలి. వారికి సాగు భూమి, ఉపాధి అవకాశాలు కల్పించాలి. పోలవరం కోసం త్యాగం చేస్తున్నా నిర్వాసితులకు ప్రతి కుటుంబానికి ఉద్యోగం ఇవ్వాలి.

**స్థానిక వనరుల వినియోగం :** అటవీ ఉత్పత్తులపై గిరిజనులకు పూర్తి హక్కులు కల్పించి, కనీస మద్దతు ధరతో కొనుగోలు చేసేలా ప్లాన్ చేయాలి. ప్రభుత్వం కేవలం జిల్లాను ప్రకటించి చేతులు దులుపుకోకుండా, తక్షణమే బడ్జెట్ కేటాయించి, అధికారులను నియమించి అభివృద్ధి పనులను ప్రారంభించాలి. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులను ఏకం చేసి పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరిస్తున్నాము.



# ప్రశాంతంగా ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు

## 138 కేంద్రాల్లో పరీక్షలు.. 24,166 మంది విద్యార్థులు హాజరు : కలెక్టర్ కీర్తిచేకూరి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సోమవారం ఉదయం స్థానిక హుకుంపేట జెడ్పీ హై స్కూల్‌లో నిర్వహిస్తున్న పదవ తరగతి వార్షిక పరీక్షలను జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా నిర్వహణ తీరును పరిశీలిస్తూ తరగతి గదుల్లో మౌలిక సదుపాయాలు, పాఠశాల ఆవరణ పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యార్థులకు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, ప్రతి తరగతి గదిలో సరైన వెలుతురు, గాలి ప్రసరణ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు, వైద్య శిబిరాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు అత్యవసర మందులు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరుగు తున్నాయని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. జిల్లాలో మార్చి 16న నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు (తెలుగు పేపర్ జనరల్ మరియు కాంపోజిట్) సజావుగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 138 పరీక్షా కేంద్రాల్లో 24,424 మంది విద్యార్థులకు గాను 24,166 మంది విద్యార్థులు హాజరయ్యారు. అదే విధంగా SSC APOSS పరీక్షలు కూడా ప్రశాంతంగా, జిల్లాలోని 26 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. APOSS పరీక్షల్లో తెలుగు సబ్జెక్టుకు 2,392 మందికి గాను 1,833 మంది, ఉర్దూకు 2 మందికి గాను 2 మంది హాజరయ్యారు. ఒరియా సబ్జెక్టుకు 1 అభ్యర్థి హజరు కావలసి ఉండగా వారు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల తనిఖీలలో భాగంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ హుకుంపేట జెడ్పీ హై స్కూల్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేయగా, జిల్లా స్థాయి పరిశీలనాధికారులు 7 కేంద్రాలు, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి 4 కేంద్రాలు, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్లు సంయుక్తంగా 8 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు 69 కేంద్రాలను తనిఖీ చేశారు. తొలి రోజున మొత్తం 88 పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. పదవ తరగతి రెగ్యులర్ పరీక్షలు 138 కేంద్రాల్లోను, SSC APOSS పరీక్షలు 26 కేంద్రాల్లోను ప్రశాంతంగా జరిగాయని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు.

# పొట్టిశ్రీరాములు భారతరత్న బిరుదివ్వాలి

**పోలవరం ప్రాజెక్టుకు పొట్టి శ్రీరాములు పేరును నామకరణం చెయ్యాలి - శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించిన రాజకీయ ప్రముఖులు**

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు డిన్నర్ సెట్లు పంపిణీ**







**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సోమవారం ఉదయం స్థానిక డిలక్స్ సెంటర్ నందు అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద 125వ జయంతి వేడుకలు పొట్టి శ్రీరాములు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పండుగ వాతావరణంలో అత్యంత వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమండ్రి రూరల్ శాసన సభ్యులు బుచ్చయ్య చౌదరి,శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్ళపు సుబ్రమణ్యం, జనసేన నాయకులు అత్తి సత్యనారాయణ, శెట్టిబలిజి కార్పొరేషన్ సెంచ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గన్ని కృష్ణ,వైశ్య హాస్టల్ అధ్యక్షులు కోట్ల కనకేష్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు తవ్వ రాజా, వై ఎం బి ఏ అధ్యక్షులు పచ్చిగోళ్ళ సురేష్ ,ఏవిఓజీ ఏ అధ్యక్షులు కొల్లూరి గోపాలకృష్ణ, రోటరీ క్లబ్ అధ్యక్షులు తీగల రాజా,రాష్ట్ర సువర్ణ వర్తక సంఘం రాష్ట్ర కార్యదర్శి కుర్మదాసు ప్రభాకర్ , బూర్లగడ్డ సుబ్బా రాయుడు, కనకాల రాజా , అడపా రాజు, వివిధ వైశ్య సంఘాల నాయకులు, పుర ప్రముఖులు విచ్చేసి కార్యక్రమం జయప్రదం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వెత్సా వెంకట సుబ్రహ్మణ్యం (బాబ్జీ), కార్యదర్శి పందిరి వీరభర స్వామి విచ్చేసిన పెద్దలకు పొట్టి శ్రీరాములుని భారతరత్న బిరుదు తో సత్కరించాలి,పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టుకి అమరజీవి నామకరణం చేయాలని మెమొరాండం లు సమర్పించారు. జయంతోత్సవం సందర్భంగా అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం పెట్టినందుకు రాష్ట్ర ప్రభుత్వంకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వైశ్య సేవా సదనం విద్యార్థినులకు, అంగన్వాడీ కేంద్రాల పిల్లలు 200 మందికి డిన్నర్ సెట్లు అందచేశారు. సభకు సహకరించిన గోయజ్ సంస్థ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఏప్రిల్ 12న పూర్వ విద్యార్థుల సంఘం ఎన్నికలు

**అటానమస్ ప్రతిష్ట పెంచేలా పనిచేశాం - పూర్వపు విద్యార్థుల సహకారంతో అభివృద్ధి పనులు - నేక్‌గ్రేడ్, అటానమస్ స్టేటస్ నిలిచేలా కృషి**

**కళాశాలలో చదువుకుని ఉన్నత స్థానాల్లో ఉన్న విద్యార్థులు సంఘంలో చేరాల్సిందిగా అభ్యర్ధన - ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) పూర్వ విద్యార్థుల సంఘం నేతలు వెల్లడి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్) ప్రతిష్టను మరింత పెంచే విధంగా తమ కార్యవర్గం ఈ ఐదేళ్ళు పనిచేశామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్) పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ముళ్ళా మాధవ్ అన్నారు. స్థానిక కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ, దూర విద్యా కేంద్రం వద్ద సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ముళ్ళ మాధవ్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సంఘం ఎన్నికల్లో 2021లో తాము ఎన్నికయిన నాటి నుండి అందరి సహకారం తీసుకుంటూ కళాశాల ఉన్నతి కోసం అహర్నిశలు కృషి చేయడం జరిగిందన్నారు. యుజిసి నిబంధనలు మేరకు కళాశాలకు నేషనల్ అస్సెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ నుండి ఉత్తమ ర్యాంకు సాధించడంతో పాటు, అటానమస్‌గా మరో అయిదేళ్ళు పొడిగించే విధంగా కళాశాలలో మౌళిక సదుపాయాల కల్పనకు ఉన్నతస్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థుల సహకారంతో కృషి చేయడం జరిగిందన్నారు. వివిధ సందర్భాలలో కళాశాలలో చదువుకుని ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులను ఆహ్వానించి కళాశాల అభివృద్ధి వారి సహకారాన్ని కోరడం జరిగిందన్నారు. అందులో భాగంగా తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావు ద్వారా రూ.42లక్షలతో తరగతి గదులు నిర్మించడం జరిగిందన్నారు. గౌతమి నేత్రాలయం అధినేత వికె రాజు సహకారంతో రూ.6లక్షలతో ఇంటర్నేషల్ స్టేట్స్ స్టడీ సెంటర్ నిర్మాణం జరిపామన్నారు. ఇదే కళాశాలలో చదువుని, అధ్యాపకురాలుగా పనిచేసి పదవీ విరమణ చేసిన గంగాభవానీ సహకారంతో 4తరగతి గదులు నిర్మించామన్నారు. యుజిసి నిబంధనలు ప్రకారం ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులను ఆహ్వానించి విద్యార్థులకు మోటివేషన్ కల్పించే దిశగా గెస్ట్ లెక్చర్‌లు ఇప్పించామన్నారు. ఇందులో భాగంగా టాటా ఇనిస్టిట్యూట్‌కు చెందిన ప్రొఫెసర్ రామకోటి, మాజీ ఎంపి ఉండవల్లి అరుణకుమార్‌లతో మోటివేషన్ క్లాస్‌లు నిర్వహించామన్నారు. రామకోటి సిఫారస్సులతో కళాశాలలోని పలువురు విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించగలిగామన్నారు. కళాశాలకు అటానమస్ హోదా కొనసాగించాల్సిన అవసరం గురించి ఉన్నత స్థాయి వ్యక్తుల అభిప్రాయాలను యుజిసి కమిటీ ముందు ఉంచడం ద్వారా మరో 5ఏళ్ళ పాటు అటానమస్‌గా కొనసాగే విధంగా చేయగలిగామన్నారు. అలాగే నేక్ ర్యాంకింగ్‌ను నిలబెట్టేందుకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టడానికి అందరి సహకారాన్ని కోరామన్నారు. పూర్వ విద్యార్థి గుడా ఛైర్మన్ హోదాలో ఉన్న గన్ని కృష్ణ సహకారంతో రూ.23లక్షలతో రోడ్లు వేయించామన్నారు. కళాశాల ప్రాంగణంలో స్టేడియం నిర్మించాలన్న నాటి ప్రభుత్వ నిర్ణయాన్ని పునరాలోచించే విధంగా నగరంలోని అన్ని రాజకీయ పక్షాలు, ప్రముఖులు, విద్యా సంఘాల సహకారంతో ఒత్తిడి తీసుకువచ్చామన్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకోవడం ద్వారా రూ.వెయ్యి కోట్ల ఆస్తినికి కాపాడగలిగామన్నారు. టీచర్స్‌డే వేడుకల్లో అధ్యాపకులను సత్కరించడం, పిజి సెట్‌లో 100 లోపు ర్యాంకులు సాధించిన వారికి అవార్డు ప్రదానం చేయడం, కళాశాల ఇంత సువిశాల ప్రాంగణంలో నిర్మాణం చేయడానికి కారకులైన మాజీ ముఖ్యమంత్రి దివంగత టంగుటూరి ప్రకాశంపంతులు పేరిటి పురస్కారాలు అందించడం, విద్యార్థులకు వ్యాసరచన పోటీలతో పాటు క్రీడా పోటీలు నిర్వహించి వారిని ప్రోత్సహించే అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. గత ఏడాది పిజిలో సీట్లు మిగిలిపోవడంతో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ల సహకారంతో విద్యాశాఖామంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్ళి పిజి సెట్ వ్రాయని వారికి సీట్లు కేటాయించే విధంగా కృషి చేయగలిగామన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అంటే రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా పనిచేసి ఒక రోల్ మోడల్‌గా నిలిచామన్నారు. వచ్చే నెలలో పూర్వ విద్యార్థుల సంఘానికి ఎన్నికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యక్షులు వివిఎస్ఆర్ భార్గవ్, శివలు మాట్లాడుతూ తాము కార్యవర్గంగా ఈ ఏడేళ్ళు బాధ్యతాయుతంగా పనిచేశామన్నారు. సంఘం నూతన కార్యవర్గం ఎన్నికకు ఈనెల 31న నోటిఫికేషన్ విడుదల అవుతుందని, ఓటరు లిస్టును విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 6న నామినేషన్‌ల దాఖలు, 7న పరిశీలన, 8న ఉపసంహరణ, 12న పోలింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ దూరవిద్యాకేంద్రం పైఅంతుస్థులో జరుగుతుందని తెలిపారు. డిగ్రీ పూర్తి అయ్యి 10ఏళ్ళు దాటి, ఉన్నత స్థానాల్లో, రాజకీయంగా పదువుల్లో, ఉన్నత వృత్తుల్లో ఉన్న వారికి సభ్యత్వాలు ఇవ్వడం జరుగుతుందని, 35 సంవత్సరాలు దాటిన వారు మాత్రమే పోటీకి అర్హులన్నారు. సభ్యత్వాల రూపేణ వసూలు చేసిన సొమ్ము రూ.6,99,100తో పాటు పూర్వ విద్యార్థి సుంకర స్వామినాయుడు రూ.లక్ష, ప్రొఫెసర్ రామకోటి రూ.10వేలు అందించడం జరిగిందని తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి గద్దే సుధాకర్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సంఘంలో ఎంత మంది ఎక్కువ సభ్యులు చేరితే యుజిసి నిబంధనలు మేరకు కళాశాలకు అంత మేలు జరుగుతుందన్నారు. కళాశాలలో చదువుకుని ఉన్నత స్థానాల్లో ఉన్న వారంతా పూర్వ విద్యార్థుల సంఘంలో చేరాల్సిందిగా కోరారు. విలేకరుల సమావేశంలో కోశాధికారి సబ్బవరపు విజయలక్ష్మి, సభ్యులు రేవతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిని నేనే... అవకాశం ఇస్తే!!

**రూ.50 కోట్లతో పట్టణాన్ని అభివృద్ధి పథంలో పెట్టా...**

**- పట్టణ ప్రజల అదర అభిమానాలు మరువలేనివి : చైర్‌పర్సన్ రాణి**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మున్సిపల్ చైర్మన్ పతివాడ నూక దుర్గరాణీ చైర్మన్ పీఠాన్ని అధిరోహించి నేటితో పదవీకాలం ముగియనందున చైర్మన్ చాంబర్ నందు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ రాణీ మాట్లాడుతు తనకు ఐదేళ్లపాటు పట్టణ ప్రజలకు సేవ చేసే భాగ్యం కలగడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని అన్నారు. మున్సిపాలిటీలో వైసీపీ అధికారం చేపట్టినప్పుడు నుండి సభ్యులందరితో కలిసి మండపేటను అభివృద్ధి బాట పట్టించామని చెప్పారు. రూ.50 కోట్లతో మున్సిపల్ పరిధిలోని 30 వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అవకాశం ఇస్తే మహిళా రిజర్వేషన్ కోటాలో మండపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.తను రాజకీయాల్లోకి తీసుకువచ్చిన మాజీ ఉపముఖ్యమంత్రి, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ప్రముఖ పారిశ్రామికవేత్త వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరిలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. వైసీపీ పాలనలో మూడేళ్లు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మార్గదర్శకత్వంలో పనిచేసే అవకాశం దక్కిందని చెప్పారు. అలాగే ఏడాదిన్నర కూటమి ప్రభుత్వం కాలంలో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు వద్ద నుంచి అనేక విషయాలు నేర్చుకున్నానన్నారు. తాను ఎప్పుడూ పదవుల కోసం ప్రయత్నాలు చేయలేదని, వైసీపీ ఇన్‌చార్జ్ పోస్టుల కోసం కూడా ప్రయత్నించబోనని స్పష్టం చేశారు. ప్రాణం ఉన్నంతవరకు వైసీపీలోనే కొనసాగుతానని పార్టీ మారే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.ఎప్పటికీ జగన్ పక్షానే నిలబడతానని తెలిపారు. తన ఐదేళ్ల పాలనలో ప్రజల నుంచి లభించిన మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదన్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో 35 ఏళ్లుగా టీడీపీ ఆధీనంలో ఉన్న మండపేట పురపాలక సంఘాన్ని వైసీపీ కైవసం చేసుకోవడం గర్వకారణమని చెప్పారు.తాను బాధ్యతలు చేపట్టే సమయానికి మున్సిపాలిటీ ఖజానాలో రూ.21 కోట్ల నిల్వ ఉండగా ప్రస్తుతం రూ.19 కోట్లు ఉన్నాయని తెలిపారు. తన హయాంలో సుమారు రూ.50 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. పెద్ద కాలువ వద్ద ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి రూ.1.50 కోట్లు కేటాయించామని చెప్పారు. పట్టణంలోని కమ్యూనిటీ హాళ్లకు కోట్లాది రూపాయలు మంజూరు చేసి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి ప్రారంభించామని తెలిపారు. అలాగే దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కంపోస్ట్ యార్డ్ సమస్యను పరిష్కరించేందుకు స్థల సేకరణ చేసి డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని వివరించారు.

**కల్తీ పాలు అనూరియా కేసులో**

# చికిత్స పొందిన వ్యక్తి కోలుకుని డిశ్చార్జ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం పట్టణంలో నమోదైన అనూరియా కేసులపై నవీకరించిన వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాజమహేంద్రవరానికి చెందిన ఎన్.కొండబాబు (64 సంవత్సరాలు) అనూరియా (కల్తీ పాలు ఘటన) సమస్యతో కిమ్స్ హాస్పిటల్‌లో చేరి చికిత్స పొందుతూ పూర్తిగా కోలుకున్నారు. కిమ్స్ ఆసుపత్రి వైద్యుల, వైద్య అధికారుల సూచనల మేరకు ఆయనను సోమవారం డిశ్చార్జ్ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి వ్యక్తిగత పర్యవేక్షణలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆసుపత్రి వర్గాలతో సమన్వయంతో మెరుగైన వైద్య సేవలు అందించారని తెలిపారు. చికిత్స అందించిన వైద్యుల సేవలకు కొండబాబు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కిమ్స్ ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్య బృందానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైద్య సేవలు అందించే క్రమంలో ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కిమ్స్ వైద్యులు సమర్థవంతంగా చికిత్స అందించినట్లు వెల్లడించారు. కల్తీ పాలు ఘటనకు సంబంధించిన ఆరోగ్య సమస్యల నేపథ్యంలో వైద్య సేవలు అందిస్తున్నామని, వారి ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా వైద్య సేవలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

# ఎమ్మెల్యే బత్తుల తీరుపై జక్కంపూడి తీవ్ర ఆగ్రహం


**ఎన్నికలలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? - రాజకీయానికైనా, యుద్ధానికైనా ఎప్పుడు సిద్ధమే**



**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజాపై చేసిన ఆరోపణపై వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం గణేష్ కోరుకొండ జక్కంపూడి రాజా స్వగృహంలో పాత్రికేయులతో మాట్లాడుతూ జనసేన ఆవిర్భావ దినోత్సవం రోజున చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, నియోజకవర్గంలో బత్తుల దంపతుల అవినీతి నిరూపణకు మేము సిద్ధంగా ఉన్నామని, రాజకీయానికైనా యుద్ధానికైనా స్థలము, సమయం మీరు చెబితే సిద్ధమని సవాల్ విసిరారు. ఎన్నికల ముందు నియోజకవర్గాన్ని సాఫ్ట్వేర్ హబ్ గా, సింగపూర్ల అభివృద్ధి చేస్తున్న ప్రగల్భాలు ఏమయ్యాయన్నారు. గత ప్రభుత్వం లో మాపై బ్లేడ్ బ్యాచులు, బెట్టింగులు, మాఫీ అంటూ చేసిన ఆరోపణలను, మీ ప్రభుత్వంలో ఎందుకు నిరూపించలేకపోయారన్నారు? ఇప్పుడు అంతకుమించిన బెట్టింగ్, రియల్ దందా, డ్రగ్స్ మాఫియాలో జన సైనికులు ఉన్నారని, వారిపై ఎందుకు కేసులు లేవన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం గత ప్రభుత్వంలో కోట్లాది రూపాయలు నిధులు ఏమయ్యాయని, 75% పూర్తి చేసిన ఎన్డిబి రోడ్లను రెండేళ్లలో ఎందుకు పూర్తి చేయలేదన్నారు. నీ ఎంపీటీసీ రాజకీయం అందరికీ తెలిసిందేనని, నీవు ఏ అవినీతి చేయలేదని నీ గెలుపుకి కృషి చేసిన బొడ్డు వెంకటరమణ చౌదరి, ఎంపీ పురందేశ్వరి నరసన్న ఆలయంలో సత్య ప్రమాణం చేస్తే, నీ జోలికి రామన్నారు. మరోసారి ఇటువంటి ప్రగల్భాలు పలికితే సహించేది లేదని, ఎంతవరకైనా వెళ్లడానికి సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు కర్రి నాగేశ్వరరావు, నక్కా రాంబాబు, క్రొవ్విడి సత్రాజు, అడపా కనకరాజు, గణేశుల పోశయ్య, కంటే వినయ్ తేజ, కొండపల్లి దుర్గారావు, బొరుసు బద్రి, గట్టి ప్రసాద్, తాడి హరిచంద్ర ప్రసాద్, కడియాల పాపారావు,వుల్లి గణ, డీలర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**అన్నదాత సుఖీభవ మూడో విడత కార్యక్రమంలో పాల్గొన్న**

# రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం కూనవరం గ్రామంలో అన్నదాత సుఖీభవ 3 విడత డోర్ టు డోర్ కాంపెయిన్ లో రుడా చైర్మన్ తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు.




# భారీగా పెరిగిన ఉస్తాద్ అంచనాలు..



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. మొదట్లో ఈ ప్రాజెక్ట్‌పై పెద్దగా హైప్ లేకపోయినా, షూటింగ్ ఆలస్యం మరియు పవన్ రాజకీయాల వల్ల సినిమా వస్తుందా అన్న సందేహాలు వచ్చాయి. అయితే ఇప్పుడు రిలీజ్ సమయం దగ్గరపడుతున్న కొద్దీ ఫ్యాన్స్‌లో ఆసక్తి, అంచనాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా థియేటర్లలోకి వస్తుందంటే ఆ వైబ్రేషనే వేరు. 'ఉస్తాద్ భగత్ సింగ్' విషయంలో పరిస్థితులు రోజురోజుకూ మారిపోతూ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పిస్తున్నాయి. ఈ సినిమాపై అంచనాలు అనూహ్యంగా, అమాంతం పెరిగిపోతున్నాయి. అసలు పవన్ కళ్యాణ్ సినిమా అంటేనే అంతే.. రిలీజ్ డేట్ దగ్గరపడుతున్న కొద్దీ ఆటోమేటిక్‌గా ఎక్స్‌పెక్టేషన్స్ తారాస్థాయికి చేరుకుంటాయి. ఇప్పుడు ఉస్తాద్ విషయంలో కూడా సరిగ్గా ఇదే జరుగుతోంది. సినిమా ఎలా ఉండబోతోందో అన్న క్యూరియాసిటీ ప్రేక్షకుల్లో విపరీతంగా పెరిగిపోయింది. నిజానికి ఈ ప్రాజెక్ట్ మొదలైన కొత్తలో దీనిపై జనాల్లో పెద్దగా అంచనాలు లేవు. పైగా షూటింగ్ మధ్యలో చాలాసార్లు ఆగిపోవడం, రాజకీయాలతో పవన్ బిజీ అవ్వడంతో సినిమా ఇక రాదేమో అని అందరూ అనుకున్నారు. దీనికి తోడు మొదట 'భవదీయుడు భగత్ సింగ్'గా అనౌన్స్ చేసిన టైటిల్ కాస్తా.. తర్వాత 'ఉస్తాద్ భగత్ సింగ్'గా మారిపోయింది. ఇలా ఎన్నో అవాంతరాలు, వాయిదాలు చూసి ఈ ప్రాజెక్ట్‌పై బజ్ క్రియేట్ అవ్వడం కష్టమేమో అని అంతా భావించారు. కానీ పవన్ కళ్యాణ్ స్టామినా ఏంటో టైమ్ వచ్చినప్పుడు కానీ బయటపడదు అని మరోసారి ప్రూవ్ అయింది. సినిమా ప్రమోషన్స్ మొదలైన తర్వాత కూడా మొన్నటి వరకు ఒక మోస్తరు హైప్ మాత్రమే నడిచింది. పాటలు విడుదలైనప్పుడు కూడా యావరేజ్ రెస్పాన్స్ మాత్రమే వచ్చింది. కానీ ఎప్పుడైతే ట్రైలర్ రిలీజ్ అయిందో.. అంచనాలు ఒక్కసారిగా డబుల్ అయిపోయాయి. ట్రైలర్‌లో పవన్ స్వాగ్, పవర్‌ఫుల్ డైలాగ్స్ చూశాక సినిమాపై ఆసక్తి సగం పెరిగింది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌తో అయితే ఎక్స్‌పెక్టేషన్స్ ఆకాశాన్ని దాటేశాయి. మీద పవన్ ఎనర్జీ, డైరెక్టర్ కాన్ఫిడెన్స్ చూశాక థియేటర్లు దద్దరిల్లడం గ్యారెంటీ అని ఫ్యాన్స్ ఫుల్ క్లారిటీకి వచ్చేశారు. కేవలం క్రేజ్ మాత్రమే కాదు, బిజినెస్ పరంగానూ ఉస్తాద్ భగత్ సింగ్ ట్రేడ్ వర్గాల్లో దుమ్ము దులిపేస్తున్నాడు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాకు ఏకంగా రూ.130 కోట్ల మేర భారీ ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది. మొదట్లో ఉన్న సైలెన్స్ అంతా పటాపంచలైపోయి, ఇప్పుడు డిస్ట్రిబ్యూటర్లు సైతం భారీ రేట్లు వెచ్చించి మరీ రైట్స్ సొంతం చేసుకోవడానికి క్యూ కట్టారు. పవన్ కళ్యాణ్ మార్కెట్ స్టామినా ఏమాత్రం తగ్గలేదని చెప్పడానికి ఈ రూ.130 కోట్ల బిజినెస్ ఫిగర్ ఒక రేంజ్ ఎగ్జాంపుల్ అని విశ్లేషకులు చెబుతున్నారు. వీటన్నింటికీ మించి సగటు ప్రేక్షకుడిని, అభిమానులను విపరీతంగా ఆకర్షిస్తున్న మరో ప్రధాన అంశం.. 'గబ్బర్ సింగ్' కాంబినేషన్ రిపీట్ అవ్వడం. పవన్ కళ్యాణ్, డైరెక్టర్ హరీష్ శంకర్ కలయికలో వచ్చిన గబ్బర్ సింగ్ టాలీవుడ్ బాక్సాఫీస్ రికార్డులను ఎలా షేక్ చేసిందో ఎవరూ మర్చిపోలేరు. మళ్ళీ ఇన్నేళ్ల తర్వాత ఆ బ్లాక్ బస్టర్ కాంబో రిపీట్ అవుతుండటంతో ఉస్తాద్ భగత్ సింగ్‌పై ఎక్కడలేని హైప్ క్రియేట్ అయింది. అదే ఎనర్జీ, అదే మాస్ ఎలివేషన్స్‌తో ఉస్తాద్ థియేటర్లలోకి ఎంట్రీ ఇస్తే.. కలెక్షన్ల సునామీ సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. అన్నింటికి మించి ఈ ఉగాది సందర్భంగా మార్చి 19న విడుదల అవుతున్న ఒకే ఒక్క తెలుగు సినిమా ఉస్తాద్ మాత్రమే. థియేటర్స్ పరంగా కూడా ఎక్కడా ఏ ఇష్యూ లేదు.. ఒక్కసారి పాజిటివ్ టాక్ వచ్చిందంటే మాత్రం అస్సలు ఆగేదే లేదన్నట్లు పవన్ రెచ్చిపోతాడు అనడంలో ఎలాంటి సందేహం లేదు. చూడాలిక.. ఏం జరగబోతుందో..?

# ఆయనతో ఒక్క సినిమా అయినా చేయాలనుకున్నా..



ప్రఖ్యాత దర్శకుడు విశ్వనాథ్‌తో నటుడు చిరంజీవి ఒక చిత్రంలో నటించాలనే తన కోరికను తీర్చుకునేందుకు ఓ చిన్న డ్రామా ఆడినట్టు నిర్మాత అల్లు అరవింద్ గతంలో ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఈ కలయికను సాకారం చేయడానికి తాను చేసిన ప్రయత్నాలను ఆయన వివరించారు. అది కూడా స్వయంగా విశ్వనాథ్‌తోనే ఈ విషయాలను వెల్లడించారు. అప్పట్లో దర్శకుడు విశ్వనాథ్‌తో చిరంజీవి ఒక సినిమా చేస్తే బాగుంటుందని తన మనసులో బలంగా కోరుకున్నానని అల్లు అరవింద్ తెలిపారు. తెలుగు చలనచిత్ర రంగానికి విశేష సేవలందించిన కళాతపస్వి కే. విశ్వనాథ్, తన అద్భుతమైన దర్శకత్వంతో ఎన్నో గొప్ప చిత్రాలను అందించారు. ఆయన "ఆత్మ గౌరవం" చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేశారు. "స్వాతిముత్యం" 1986లో ఆస్కార్స్‌కు భారతదేశ అధికారిక ప్రవేశంగా నిలిచింది. ఆయన ఐదు జాతీయ చలనచిత్ర అవార్డులు, పది ఫిల్మ్‌ఫేర్ అవార్డులు సౌత్, పద్మశ్రీ, ఇంకా 2017లో అత్యున్నతమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డులు అందుకున్నారు. ఆయన చిరంజీవితో కలిసి పని చేయడం ఒక గొప్ప అవకాశంగా ఉంటుందని భావించానని అల్లు అరవింద్ ఆ ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ కాంబినేషన్ పట్టాలెక్కించేందుకు విశ్వప్రయత్నాలు చేశానని.. అందులో భాగంగా ఒక "చిన్న డ్రామా" ఆడానని అల్లు అరవింద్ వివరించారు. చిరంజీవి ఇంటికి వెళ్లి " మీరు సినిమాలో ఉంటే బాగుంటుందని విశ్వనాథ్ అనుకుంటున్నారని" అని చెప్పి.. ఆపై విశ్వనాథ్ వద్దకు వెళ్లి "చిరంజీవి మీతో సినిమా చేయాలని చాలా ఉత్సాహంగా ఉన్నారు" అని తెలిపినట్లు పేర్కొన్నారు. ఇక ఆ తర్వాత చిరంజీవితో శుభలేఖ, స్వయంకృషి, అపద్బంధావుడు లాంటి సూపర్ హిట్ చిత్రాలను దర్శకుడు కే.విశ్వనాథ్ అందించారు.

సినీ వాయిస్ CINEMA

# స్టార్ హీరోయిన్ బయోపిక్‌లో సాయి పల్లవి..

## బాలీవుడ్ టాప్ డైరెక్టర్‌తో క్రేజీ ప్రాజెక్ట్..



మలయాళీ బ్యూటీ సాయి పల్లవి క్రేజ్ గురించి చెప్పక్కర్లేదు. ప్రేమమ్ సినిమాతో నటిగా కెరీర్ స్టార్ చేసి.. ఆ తర్వాత ఫిదా మూవీతో తెలుగు తెరకు పరిచయమైంది. మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించిన సాయి పల్లవి.. ప్రస్తుతం పాన్ ఇండియా లెవల్లో అత్యధిక ఫాలోయింగ్ సంపాదించుకున్న హీరోయిన్‌గా దూసుకుపోతుంది. సాయి పల్లవి.. ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి చెప్పక్కర్లేదు. భాషలతో సంబంధమే లేకుండా.. గ్లామర్ షోకు దూరంగా ఉంటూ కేవలం తన సహజ నటనతోనే పాన్ ఇండియా లెవల్లో వరుస సినిమాలతో దూసుకుపోతుంది. సౌత్ టూ నార్త్ విపరతీమైన క్రేజ్ సొంతం చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. తండేల్ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న సాయి పల్లవి ప్రస్తుతం హిందీలో రామాయణం సినిమాలో నటిస్తుంది. అలాగే ఇప్పుడిప్పుడే హిందీలో వరుస ఆఫర్స్ అందుకుంటుంది. తాజాగా బీటౌన్ టాప్ డైరెక్టర్ సంజయ్ లీలా భన్సాలీ నెక్ట్స్ ప్రాజెక్ట్ ఛాన్స్ కొట్టేసిందట. ప్రస్తుతం భారతీయ సినీ చరిత్రలో ధ్రువతారగా వెలిగిన అందాల నటి మధుబాల బయోపిక్ లో సాయి పల్లవి నటించనున్నట్లు సమాచారం. ఈ క్రేజీ ప్రాజెక్టును బాలీవుడ్ డైరెక్టర్ సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్నారు. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అయితే మధుబాల బయోపిక్ కోసం ముందుగా కియారా అద్వానీ, అనీత్ పడ్డా వంటి స్టార్ హీరోయిన్ల పేర్లు పరిశీలనలోకి వచ్చాయట. కానీ మధుబాల పాత్రలో ఉండే గాంభీర్యం, సహజ సిద్ధమైన నటనను పండించాలంటే సాయి పల్లవి కరెక్ట్ అంటున్నారు. డైరెక్టర్ సంజయ్ లీలా భన్సాలీ ఇదివరకు ఎన్నో అద్భుతమైన చిత్రాలను తెరకెక్కించారు. పద్మావత్, గంగూబాయి కతియావాడి హిట్ చిత్రాలతో సక్సెస్ అందుకున్నారు. ఇప్పుడు మధుబాల లాంటి ఐకానిక్ పాత్రను సాయిపల్లవితో రూపొందిస్తుండడంతో సినిమా పై మరిన్ని అంచనాలు పెరిగాయి.

క్రీడా వాయిస్

# బ్యాటర్లు క్రీజు దాటితే అంతే సంగతులు..

## ఐపీఎల్ చరిత్రలో టాప్-5 వికెట్ కీపర్లు వీరే



ఐపీఎల్ అంటే కేవలం భారీ సిక్సర్లు, పరుగుల వరద మాత్రమే కాదు.. మైదానంలో వికెట్ల వెనుక జరిగే మాయాజాలం కూడా. ఒక అద్భుతమైన క్యాచ్ లేదా సెకనులో వందో వంతు కాలంలో చేసే స్టంపింగ్ మ్యాచ్ ఫలితాన్నే మార్చేస్తుంది. ఐపీఎల్ చరిత్రలో వికెట్ కీపర్‌గా అత్యధిక మంది బ్యాటర్లను పెవిలియన్‌కు పంపిన ఘనత మన టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీకే దక్కుతుంది. 2008 నుంచి 2025 వరకు జరిగిన ఐపీఎల్ ప్రయాణంలో ధోనీ మొత్తం 278 మ్యాచ్‌లు ఆడి, 201 మందిని అవుట్ చేశాడు. ఇందులో 154 క్యాచ్‌లు, 47 స్టంపింగ్స్ ఉన్నాయి. ధోనీ వేగానికి, పదునైన వ్యూహాలకు క్రికెట్ ప్రపంచం ఎప్పుడూ ఫిదా అవుతూనే ఉంటుంది.

**దినేష్ కార్తీక్ :** ఈ జాబితాలో రెండో స్థానంలో అనుభవజ్ఞుడైన దినేష్ కార్తీక్ నిలిచారు. సుదీర్ఘ కాలం పాటు వివిధ జట్ల తరఫున ఆడిన కార్తీక్, తన కీపింగ్ నైపుణ్యంతో అందరినీ ఆకట్టుకున్నారు. ఆయన మొత్తం 257 మ్యాచ్‌ల్లో 174 డిస్మిసల్స్ సాధించారు. ఇందులో 137 క్యాచ్‌లు, 37 స్టంపింగ్స్ ఉన్నాయి. అత్యధిక మ్యాచ్‌లు ఆడిన సీనియర్ ప్లేయర్లలో ఒకరిగా కార్తీక్ వికెట్ల వెనుక తనదైన ముద్ర వేశారు.

**వృద్ధిమాన్ సాహా :** మూడో స్థానంలో 'సూపర్‌మ్యాన్' అని పిలవబడే వృద్ధిమాన్ సాహా నిలిచారు. టెక్నికల్‌గా అత్యంత పటిష్టమైన వికెట్ కీపర్‌గా పేరు తెచ్చుకున్న సాహా, కష్టమైన క్యాచ్‌లను కూడా ఎంతో సులభంగా పట్టేయడంలో దిట్ట. ఆయన ఐపీఎల్ కెరీర్‌లో మొత్తం 113 మంది బ్యాటర్లను అవుట్ చేశారు. ఇందులో 87 క్యాచ్‌లు ఉండగా, 26 స్టంపింగ్స్ ఉన్నాయి. వికెట్ల వెనుక ఆయన ఇచ్చే భరోసా జట్టుకు ఎప్పుడూ పెద్ద బలంగా మారుతుంది.

**రిషబ్ పంత్ :** యువ సెన్సేషన్ రిషబ్ పంత్ ఈ జాబితాలో నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు. కేవలం 125 మ్యాచ్‌ల్లోనే 101 డిస్మిసల్స్ సాధించి పంత్ అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇందులో 77 క్యాచ్‌లు, 24 స్టంపింగ్స్ ఉన్నాయి. ఇతర కీపర్లతో పోలిస్తే, ప్రతి ఇన్నింగ్స్‌లో సగటు డిస్మిసల్స్ పరంగా పంత్ చాలా మెరుగ్గా ఉన్నారు. ధోనీ తర్వాత వికెట్ల వెనుక అంతటి దూకుడును ప్రదర్శించే కీపర్‌గా పంత్ గుర్తింపు పొందారు.

**రాబిన్ ఉతప్ప :** ఇక ఐదో స్థానంలో రాబిన్ ఉతప్ప తన ప్రతిభను చాటుకున్నారు. బ్యాటర్‌గానే కాకుండా పార్ట్-టైమ్, ఫుల్-టైమ్ కీపర్‌గా కూడా ఉతప్ప అద్భుతమైన విన్యాసాలు చేశారు. ఆయన ఐపీఎల్ చరిత్రలో మొత్తం 90 మందిని అవుట్ చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఇందులో 58 క్యాచ్‌లు, 32 స్టంపింగ్స్ ఉన్నాయి. స్టంప్స్ వెనుక ఉతప్ప చూపించే చురుకుదనం బ్యాటర్లను ఎప్పుడూ భయపెడుతూనే ఉంటుంది.

# కర్ణాటక ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్..

## ఆర్సీబీ ఫ్యాన్స్‌కు ఇది అదిరిపోయే గుడ్ న్యూస్



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అభిమానులకు ఎట్టకేలకు ఒక భారీ ఊరట లభించింది. ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్ లు నిర్వహించుకోవడానికి కర్ణాటక ప్రభుత్వం అధికారికంగా అనుమతిని ఇచ్చింది. గత ఏడాది కొన్ని చేదు అనుభవాల వల్ల స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణపై సందిగ్ధత నెలకొన్నప్పటికీ, ఇప్పుడు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో బెంగళూరు అంతటా పండగ వాతావరణం నెలకొంది. మార్చి 28న ఈ మైదానంలోనే డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య తొలి పోరు జరగనుంది.కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సంతోష్ మీనన్ ఈ విషయాన్ని ధృవీకరించారు. స్టేడియంలో భద్రత, మౌలిక సదుపాయాల్లో మార్పులను పర్యవేక్షించడానికి నియమించిన నిపుణుల కమిటీ, స్టేడియాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసింది. మార్చి 13న స్టేడియంలో నిర్వహించిన మాక్ డ్రిల్, ఇతర భద్రతా చర్యల పట్ల కమిటీ సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగానే ప్రభుత్వం తాజాగా అనుమతులు మంజూరు చేసింది. కర్ణాటక హోం మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో కేఎస్‌సీఏ ప్రతినిధులతో పాటు ఆర్సీబీ మేనేజ్‌మెంట్, భద్రతా నిపుణులు పాల్గొన్నారు. స్టేడియం లోపల, వెలుపల ప్రేక్షకుల నియంత్రణ, అత్యవసర మార్గాలు, కొత్త భద్రతా నిబంధనల అమలుపై సమగ్రంగా చర్చించారు. నిపుణుల కమిటీ ఇచ్చిన సిఫార్సుల మేరకు స్టేడియం ఇప్పుడు పూర్తి సురక్షితమని హోం మంత్రి ప్రకటించారు. నిజానికి, గత సీజన్ (2025)లో ఆర్సీబీ తన మొట్టమొదటి ఐపీఎల్ టైటిల్ గెలిచిన తర్వాత బెంగళూరులో నిర్వహించిన విక్టరీ పరేడ్ లో తీవ్ర విషాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. ఈ ఘటనతో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. దాని ప్రభావంతోనే 2026 టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌లను కూడా బెంగళూరు నుంచి ఇతర నగరాలకు తరలించాల్సి వచ్చింది. అయితే, ఇప్పుడు లోటుపాట్లన్నీ సరిదిద్దడంతో మళ్ళీ ఐపీఎల్ హంగామాకు చిన్నస్వామి స్టేడియం ముస్తాబైంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com